DATE: 16-06-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 65

పేజీలు - 08
వెల: రూ 5/-

గురువారం 16 జూన్, 2022

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



కార్పోరేట్ ఫీజు దోపిడీని అరికట్టాలి బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా 5లో



జగిత్యాల లో మట్కా స్థావరాలపై సిఎసెస్ పోలీసులు దాడి 5లో

## గ్యాస్ వినియోగదారులకు షాక్

కొత్త కనెక్షన్ల సెక్యూరిటీ డిపాజిట్ పెంపు



**ముంబై,జూన్15:** వంటగ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచిన కేంద్రం ఇపుడు వినియోగదారులకు మరో షాక్ ఇవ్వనుంది. గ్యాస్ కొత్త కనెక్షన్లు తీసుకునే వారు చెల్లించాల్సిన వన్‌టైమ్ సెక్యూరిటీ డిపాజిట్‌ను పెంచేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ – మిగతా 2లో

## మూడోరోజూ విచారణకు రాహుల్ హాజరు

- ఆందోళనకు దిగిన కాంగ్రెస్ శ్రేణుల అరెస్ట్
- ఎఐసిసి కార్యాలయంలోకి పోలీసులు
- మండిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు



**న్యూఢిల్లీ,జూన్15:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మూడోరోజు బుధవారం ఈడీ విచారణకు హాజరయ్యారు.అయితే ఈడీ విచారణను నిరసిస్తూ వందలాదిమంది కాంగ్రెస్ శ్రేణులు నిరసనకు దిగారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకుని స్టేషన్ కు తరలించారు. ఇక – మిగతా 2లో

# ఉమ్మడిగానే..

- రాష్ట్రపతి ఎన్నికల బరిలో ఉమ్మడి అభ్యర్థి
- మమతా బెనర్జీ నేతృత్వంలో వివిధ పార్టీల అంగీకారం
- పోటీ చేయడానికి నిరాకరించిన శరద్ పవార్
- గోపాలకృష్ణ గాంధీ, ఫరూఖ్ అబ్దుల్లాల పేర్లు పరిశీలన
- మమతా బెనర్జీ సమావేశానికి ఆప్, తెరాస దూరం
- రాష్ట్రపతి ఎన్నికలపై రాజకీయ పార్టీల్లో కదలిక
- రాజ్యసభలో విపక్షనేత ఖర్గేతో రాజ్‌నాథ్ మంతనాలు
- విపక్ష సభ్యులకు రాజ్‌నాథ్ ఫోన్
- తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థన



**న్యూఢిల్లీ,జూన్15:** రాష్ట్రపతి ఎన్నికల వ్యవహారం రోజురోజుకు రసవత్తరంగా మారుతోంది. ఓవైపు మమతా బెనర్జీ విపక్షాల ఐక్యతకు ప్రయత్నాలు చేస్తుంటే.. అధికార భాజపా ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు పావులు కదుపుతోంది. రాష్ట్రపతి ఎన్నికల విషయంలో ఏకాభిప్రాయం తీసుకొచ్చే బాధ్యతను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు – మిగతా 2లో



## గౌరవెల్లిలో నిర్వాసితులపై లాఠీఛార్జీ అమానుషం

- పోలీసులు తీరుపై కాంగ్రెస్, సీపీఐ నేతల ఆగ్రహం
- బాధ్యులైన పోలీసులపై చర్యకు నేతల డిమాండ్
- బాధితులకు అండగా నిలవాలని మంత్రి హరీష్‌కు పొన్నం డిమాండ్
- భూ నిర్వాసితుల రక్తం పారేలా చేశారు
- హామీలపై నిలదీస్తే లాఠీఛార్జ్
- గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన బండి

**సిద్దిపేట,జూన్15:** నిర్వాసితులపై జరిగిన లాఠీ ఛార్జిపై మంత్రి హరీష్ రావు స్పందించాలని కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా గౌరవెల్లిలో నిర్వాసితులపై పోలీసుల లాఠీ ఛార్జీ నేపథ్యంలో బాధితుల సమస్య పరిష్కరించేందుకు మంత్రి హరీష్ రావును కలవాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో పొన్నం ప్రభాకర్ రెడ్డి, కోదండ రెడ్డి.. మంత్రి పి.ఎస్.తో ఫోన్ లోనే సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో లాఠీఛార్జి అంశాన్ని లేవనెత్తిన పొన్నం.. మహిళలని కూడా చూడకుండా పోలీసులు దాడిచేసి, గాయపరిచారని వాపోయారు. కానీ ఎస్పీ మాత్రం ఎలాంటి లాఠీ ఛార్జీ జరగలేదన్నడం సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే గౌరవెల్లిలో చాలా పనులు జరిగాయని ఈ సందర్భంగా పొన్నం గుర్తు చేశారు. అయితే'చిన్న చిన్న సమస్యలను సమర్థంగా పరిష్కరించి ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగు నీరందించవచ్చు. కానీ ఉద్దేశపూర్వకంగా ముందుకు వెళ్ళకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్లుందని పొన్నం తెలిపారు. ఇది ప్రభుత్వానికే నష్టమన్న ఆయన.. బాధితులకు న్యాయం జరగడం కోసం హరీష్ రావును కలుస్తామని స్పష్టం చేశారు. గుడాటిపల్లి భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో భూనిర్వాసితుల ఆందోళనకు నేతలు సంఘీభావం తెలిపారు. – మిగతా 2లో

## రాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

- 29 వరకు నామినేషన్ల స్వీకరణ
- జూలై 18న రాష్ట్రపతి ఎన్నిక.. 21 ఫలితం వెల్లడి
- 25న కొత్త రాష్ట్రపతి ప్రమాణస్వీకారం

**న్యూఢిల్లీ,జూన్15:** భారత రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. జూన్ 30 నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ జులై 2. – మిగతా 2లో

### బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల

## ఆందోళన

- రెండోరోజూ కొనసాగిన నిరసనలు
- కలెక్టర్‌తో విద్యార్థులు జరిపిన చర్చలు విఫలం
- బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు మంత్రి కేటీఆర్ భరోసా
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- విద్యార్థులు ఆందోళన చెందవద్దన్న మంత్రులు
- అధికారుల తీరుపై మంత్రి సబిత ఆగ్రహం
- అధికారులతో అత్యవసరంగా భేటీ

- బాసరలో చిన్న విసయాలను పెద్దవిగా చేస్తున్నారు
- విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయొద్దు
- బాసర ఘటనపై సమీక్షించిన మంత్రి సబిత



**బాసర,జూన్15:** బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆందోళన రెండో రోజు కొనసాగింది. ట్రిపుల్ ఐటీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ విద్యార్థులు నిరసనకు దిగారు. – మిగతా 2లో

### వైద్యారోగ్య శాఖలో 1,326 డాక్టర్ల..

# పోస్టుల భర్తీ

## నోటిఫికేషన్ వెలువరించిన ప్రభుత్వం



**హైదరాబాద్,జూన్15:** రాష్ట్రంలో వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న 1,326 డాక్టర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. 751 సివిల్ అసిస్టెంట్ సర్జన్(డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్) పోస్టులు, 357 ట్యూటర్లు(డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్), 211 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ? జనరల్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(తెలంగాణ వైద్య విధాన పరిషత్), 7 సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివేంటివ్ మెడిసిన్) పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన వారి నుంచి జులై 15 నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తదితర వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు.

### మంకీపాక్స్ పేరు మార్చే యోచనలో డబ్ల్యూహెచ్ఓ

జెనీవా,జూన్15: దాదాపు 30 దేశాలకు విస్తరించిన మంకీపాక్స్ వైరస్ పేరు మార్చాలని ప్రపంచ – మిగతా 2లో



### ఎనిమిదేళ్లలో ఆదర్శంగా

# తెలంగాణ

- కేసీఆర్ ప్రగతి ప్రాంగణాన్ని ప్రారంభించిన కేటీఆర్
- త్వరలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేస్తాం
- సొంత జాగాలో ఇళ్లు కట్టుకునే వారికి ఆర్థిక సాయం
- వెల్లడించిన మంత్రి కేటీఆర్

**రాజన్నసిరిసిల్ల,జూన్15:** రాష్ట్రంలోని గ్రామాలు, పల్లెలను ఎనిమిదేండ్లలో దేశానికే ఆదర్శంగా నిలిపామని మంత్రి కేటీఆర్ అన్నారు. మనందరి బాగుకోసమే సీఎం కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెలో జరిగిన ప్రగతి కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. రూ.33 లక్షలతో నిర్మించిన కేసీఆర్ ప్రగతి ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల – మిగతా 2లో

## రాష్ట్రంలో మరో 11 వృద్ధాశ్రమాలు

### మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదారాబాద్ జూన్ 15 (ప్రజా మంటలు) : వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వ ఆధ్వర్యంలో రంగారెడ్డి, కరీంనగర్ లలో 2 ఆశ్రమాలు నడుస్తున్నాయని, మరో 11మంజూరు చేశామని తెలిపారు జూన్15.న ప్రపంచ వయో వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్



ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ. సేవా దృక్పథంతో నడిపిస్తున్న ఆశ్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, .రాష్ట్రంలో 2 వేల 700 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ సుమారు 11లక్షల మందికి ప్రతి నెల రూ.2వేల 16చొప్పున అందజేస్తున్నామని కొప్పుల వివరించారు.

ఈ ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన కారణంగా వృద్ధులలో చాలా మంది మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు 2007లో చేసిన చట్టాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్నదని, కోవిడ్ బారిన పడిన వారిని అన్ని విధాలా అందుకున్నాయి మంత్రి ఈశ్వర్ వివరించారు.

– మిగతా 2లో

## ప్రజానాడి




### రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అధ్వానం

కాంగ్రెస్ అఖిలపక్షంలో దాసోజు శ్రవణ్ ఆరోపణ

**హైదరాబాద్,జూన్15:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అధ్వానంగా మారిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ అన్నారు. బచావో హైదరాబాద్ పేరుతో కాంగ్రెస్ నిర్వహిస్తున్న అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శాంతి భద్రతల విషయంలో అధికారపార్టీ కఠినంగా వ్యవహరించాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి మూడు వారాల్లోగా శిక్ష పడేలా చూడాలని, ఇందుకోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పొరుగు రాష్ట్రం ఏపీలో

– మిగతా 2లో

## గ్యాస్ వినియోగదారులకు షాక్

మొదటిపేజీ తరువాయి..

మంగళవారం ఆమోదం తెలిపింది. చమురు మార్కెటింగ్ కంపెనీల డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సబ్సిడీ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జరుగుతున్న కసరత్తుతోపాటు, ఏ వంటగదిలోనూ ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు (గరిష్ఠంగా రెండు సిలిండర్లు) ఉండకూడదనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చమురు మార్కెటింగ్ కంపెనీలు చెబుతున్నాయి. అంటే డొమెస్టిక్ (14.2 కిలోలు) సిలిండర్‌పై సెక్యూరిటీ డిపాజిట్ రూ. 1450గా ఉంది. తాజా పెంపుతో కొత్తసింగిల్ సిలిండర్ ఇండేన్ కనెక్షన్ కోరుకునే వారు రూ.2,500కు పైనే చెల్లించాలి. సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు ఇతర చార్జీల బాదుడు కూడా తప్పదు. ఫలితంగా కొత్తగా గ్యాస్ కనెక్షన్ పొందాలనే కస్టమర్లకు అదనపు భారం పడుతుంది. అయితే ఉజ్వల స్కీమ్ వినియోగదారులకు సవరించిన రేట్లు వర్తించవు. అలాగే డబుల్ సిలిండర్ కనెక్షన్ పొందే వారికి మరింత భారం తప్పదు. ఇక రూ. 800గా ఉన్న 5 కేజీల సిలిండర్ డిపాజిట్ మొత్తం రూ. 1150కు చేరింది. దీంతోపాటు రెగ్యులేటర్‌కు గతంలోని 150 రూపాయలతో పోలిస్తే ఇపుడు రూ. 250 చెల్లించుకోవాలి. పెంచిన ధరలు రేపటి నుంచి (జూన్ 16) నుంచి అమలులోకి వస్తాయి. ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త కనెక్షన్‌కు రూ.900 నుంచి రూ.1,150కి, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో రూ.200 నుంచి రూ.1,450 చెల్లించాల్సి ఉంటుంది. సబ్సిడీ దుర్విని యోగాన్ని అరికట్టేందుకు జరుగుతున్న కసరత్తు, ఏ వంటగదిలోనూ ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉండకూడదనే లక్ష్యంతో ఉంది. బహుళ కనెక్షన్లు ఉన్నవారు అదనపు కనెక్షన్లను సరెండర్ చేయాల్సి ఉంటుంది. అలాంటి కనెక్షన్‌లన్నింటినీ బ్లాక్ చేస్తున్నాయి. అంతేకాదు అదనపు కనెక్షన్ సరెండర్ అయ్యే వరకు రీఫిల్‌లను జారీ చేయడం లేదు.అలాగే కనెక్షన్లు బ్లాక్ చేయబడిన కస్టమర్లు మరొక చమురు కంపెనీ నుండి తాజా కనెక్షన్‌ను పొందకుండా నిరోధించేలా కొత్త కనెక్షన్‌లను నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## మూడోరోజు విచారణకు రాహుల్ హాజరు

మొదటిపేజీ తరువాయి..

రెండో రోజు 10 గంటల పాటు రాహుల్ ను విచారించింది ఈడీ. సుమారు 80 ప్రశ్నలను ఈడీ సంధించినట్లు తెలుస్తోంది. కాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టి వేధిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈడీని కేంద్రం ఎలక్షన్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్?గా వాడుకుంటోందని, ఇప్పటిదాకా ప్రత్యర్థులపై 5 వేల కేసులు పెట్టించిందని ఆరోపించింది. సోనియా, రాహుల్ లపై ఎన్ని అక్రమ కేసులు పెట్టిన వెనక్కి తగ్గేది లేదని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసుల తీరుపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. రాహుల్ గాంధీ ఈడీ విచారణ నేపథ్యంలో.. కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే.. కాంగ్రెస్ కార్యకర్తలను ఏఐసీసీ కార్యాలయంలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, ఆపై కార్యాలయంలోనే కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బుధవారం నిరసనలు కొనసాగుతున్న సమయంలో.. అక్బర్‌రోడ్డు వద్ద ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ముందు ఢిల్లీ పోలీసులతో కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగారు. ఒకానొక టైంలో ఏఐసీసీ గేట్లు బద్దలు కొట్టి పోలీసులు కార్యాయంలోకి వచ్చి, తమ నేతలను అరెస్ట్ చేసినట్లు కాంగ్రెస్ ఆరోపణలకు దిగింది. ఈ పరిణామంపై పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా తీవ్రంగా స్పందించారు. అసలు పార్టీ కార్యాలయంలోకి పోలీసులు ఎలా వస్తారని నిలదీశారు. పోలీసులు గుండాల్లా ప్రవర్తించారని మండిపడ్డారాయన.

### మంకీపాక్స్ పేరు మార్చే యోచనలో డబ్ల్యూహెచ్ఓ

మొదటిపేజీ తరువాయి..

ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్ణయించింది. 30కి పైగా అంతార్జాతీయ శాస్త్రవేత్తలు మంకీపాక్స్ పేరును మార్చాలని సూచించడంతో డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ అతి త్వరలో మారుస్తామని తెలిపారు. పేరును వైరస్ రావడానికి గల కారణాలతో పెట్టాలని నిర్ణయించారు. డబ్ల్యూహెచ్ఓ రూల్స్ ప్రకారం భౌగోళిక ప్రాంతాలు, జంతువుల పేర్లను వాడకూడదు.

# ఉమ్మడిగానే..

మొదటిపేజీ తరువాయి..

భాజపా అప్పగించింది. ఆయన ఈ విషయంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల తరపున ఉమ్మడి అభ్యర్థిని బరిలో నిలపాలని మమతా బెనర్జీ నేతృత్వంలో జరిగిన 17 పార్టీల విపక్ష పార్టీల భేటీలో తీర్మానం చేశారు దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 'రానున్న రాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని బరిలో నిలపాలని విపక్ష పార్టీల నేతలు తీర్మానం చేశారు. భారత రాజ్యాంగానికి సంరక్షకుడిగా సేవ చేయగల అభ్యర్థి, ప్రజాస్వామ్యానికి, దేశ సామాజిక నిర్మాణానికి మరింత నష్టం కలిగించుకండా మోదీ ప్రభుత్వాన్ని ఆపగలిగే వ్యక్తిని నిలపాలని నిర్ణయించారని తెలిపారు. ఉమ్మడి అభ్యర్థిని బరిలో నిలపాలనే ఏకాభిప్రాయానికి వచ్చినట్లు బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఆ అభ్యర్థికి ప్రతి పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. సమావేశానికి హాజరుకాని వారిని సైతం సంప్రదిస్తామని, ఇది ఒక మంచి ఆరంభమన్నారు. కొన్ని నెలల తర్వాత అంతా కలిసి సమావేశమయ్యామని, భవిష్యత్తు లోనూ ఇలాంటి సమావేశాలు జరుగుతాయన్నారు. ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థి సహా.. దేశంలో పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రతిపక్షాలు ఐక్యంగా కేంద్రాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి కాంగ్రెస్, టీఎంసీ, ఎన్‌సీపీ, డీఎంకే సహా మొత్తం 17 పార్టీల నేతలు హాజరవగా.. ఆప్, తెరాస, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ దూరంగా ఉన్నాయి.రాష్ట్రపతి ఎన్నికల నగారా మోగిన క్రమంలో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టేందుకు విపక్షాలు కసరత్తు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే విపక్షాల సమావేశానికి గత వారం బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. ఏడుగురు ముఖ్యమంత్రులు సహా మొత్తం 19 రాజకీయ పార్టీలకు లేఖ రాశారు. అయితే రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తేలేదని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ తేల్చి చెప్పారు. విపక్షాల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ అంశంపై స్పందించారు. భేటీలో పవార్ అభ్యర్థిత్వాన్ని మమత ప్రతిపాదించగా.. ఆయన సున్నితంగా తిరస్కరించారు. తాను ఇంకా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగాలని కోరుకుంటున్నానని స్పష్టంచేశారు.

రాష్ట్రపతి రేసుపై శరద్ పవార్ క్లారిటీ ఇవ్వడంతో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పడింది. ఎన్డీఏకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల తరఫున ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే అంశంపై చర్చించేందుకు మమత బెనర్జీ ఏర్పాటు చేసిన సమావేశానికి 16 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

శరద్ పవార్ పోటీకి నిరాకరించడంతో మమతా బెనర్జీ మరో రెండు పేర్లు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. బెంగాల్ మాజీ గవర్నర్ గోపాల కృష్ణ గాంధీతో పాటు నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఫారూఖ్ అబ్దుల్లాల్లో ఒకరిని బరిలో నిలపాలని సూచించినట్లు సమాచారం. రాష్ట్రపతి ఎన్నికను ఏకగ్రీవం చేసే దిశగా భాజపా అగ్రనేత రాజ్‌నాథ్ సింగ్ ప్రయత్నాలు మొదలు పెట్టారు.

కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గేను కలిసి ఏకగ్రీవ అభ్యర్థిపై చర్చించారని సమాచారం. ప్రధాని మోదీ తమ అభిప్రాయాలను తెలుసుకోవాలని అనుకుంటున్నారని రాజ్‌నాథ్ తనతో చెప్పినట్లు ఖర్గే వెల్లడించారు. ప్రభుత్వ ప్రతిపాదనలు ఏంటన్న విషయాన్ని తాను అడిగినట్లు చెప్పారు.

అభ్యర్థిని ఎవరిని నిలబెడుతున్నారని అడిగానని తెలిపారు.

అయితే, తనతో సంప్రదింపులు కొనసాగించే విషయంపై రాజ్‌నాథ్ స్పష్టతనివ్వలేదని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. వివాదాలు లేని అభ్యర్థి పేరును విపక్షాలు ప్రతిపాదిస్తే అందుకు ప్రభుత్వం మద్దతిస్తుందా అని ప్రశ్నించారు. ఏకగ్రీవంగా అభ్యర్థిని గెలిపించే అవకాశం ఉందా అని అడిగారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రపతి ఎన్నికలపై చర్చించేందుకు సమావేశమవ్వాలని పిలుపునిచ్చిన బంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఆదిలోనే చుక్కెదురైంది! సమావేశానికి తెలంగాణ రాష్ట్ర సమితి(తెరాస), ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గైర్హాజరు కానున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ ఈ భేటీకి వస్తున్న నేపథ్యంలో తెరాస.. భేటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఎన్డీయే అభ్యర్థికి ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాలంటూ బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్.. ప్రతిపక్షాలకు ఫోన్ చేస్తున్నారు.

బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గేతో ఫోన్‌లో సంప్రదించిన రాజ్‌నాథ్.. సాయంత్రం మమతా బెనర్జీ, అఖిలేష్‌యాదవ్‌తోపాటు మరికొందరితోనూ ఫోన్‌లో మాట్లాడారు. అయితే ఆయన ప్రయత్నాలు ఫలించడం మాత్రం కష్టంగా కనిపిస్తోంది. పైగా ఫోన్‌లోనూ ఆయనకు వ్యతిరేక ఫలితం ఎదురైనట్లు జాతీయ మీడియాలు కథనాలు ప్రచురిస్తున్నాయి. ఇక బీజేపీ పార్లమెంటరీ బోర్డు కూడా సమావేశమై ప్రధాని నరేంద్ర మోదీ జర్మనీ పర్యటనకు ముందే రాష్ట్రపతి అభ్యర్థి పేరును ఖరారు చేసి ప్రకటించనున్నారు.

## గౌరవెల్లిలో నిర్వాసితులపై లాఠీఛార్జీ అమానుషం

మొదటిపేజీ తరువాయి..

కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి మద్దతు పలికారు. మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ తరహాలో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని పొన్నం డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే గుడాటిపల్లి భూనిర్వాసితుల దీక్షా శిబిరానికి వచ్చి మాట్లాడాలని మంత్రి హరీశ్ రావుకు కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. లేనిపక్షంలో నిర్వాసితులను తీసుకుని హరీశ్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. వారి నుంచి మంత్రికి ఏం జరగకుండా తమ కార్యకర్తలు రక్షణ కవచంగా ఉంటారని చెప్పారు. మంత్రి ఆదేశాలతోనే నిర్వాసితులపై లాఠీఛార్జ్ జరిగిందని పొన్నం ఆరోపించారు. దీనికి ఆయనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులపై లాఠీఛార్జ్, బలప్రయోగం జరగలేదని సీపీ చెప్పడం విడ్డూరంగా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. ఐపీఎస్ ఉద్యోగంలో ఉన్న ఆమె విజ్ఞత ఇదేనా అని ప్రశ్నించారు. తెరాస నాయకులు నిర్వాసితులను రెచ్చగొట్టేలా వ్యవహరించారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే నిర్వాసితులను బలిపశువులను చేస్తున్నారని పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఈ రాములు నాయక్, సీఐ రఘుపతి రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసి తులపై అర్ధరాత్రి పోలీసులు దాడి చేసి, అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మరో కాంగ్రెస్ నేత కోదండ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలా వాదించిన ఘటనలు లేవన్న ఆయన... న్యాయంగా పరిహారం, అర్ అండ్ అర్ ప్యాకేజీ కావాలని నిర్వాసితులు కోరుకుంటున్నారని తెలిపారు. అధికారులు తలా ఓ మాట మాట్లాడుతున్నారని.. ఎవరికి గోడు చెప్పుకోవాలో బాధితులకు తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. 'పరిష్కారం ఆఫీసర్ల చేతిలో లేదు.. ప్రభుత్వమే పరిష్కరించాలి. మంత్రి చొరవ చూపాలని కోదండ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ రాజకీయం చేయాలని భావించడం లేదన్న ఆయన... బాధితులకు న్యాయం చేయాలని కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. గుడాటిపల్లి భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో భూనిర్వాసితుల ఆందోళనకు నేతలు సంఘీభావం తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి మద్దతు పలికారు. మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ తరహాలో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని పొన్నం డిమాండ్ చేశారు. మరోవైపు లాఠీఛార్జ్‌లో గాయపడి.. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిర్వాసితులను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పరామర్శించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లిలో భూ నిర్వాసితుల దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్, సీపీఐ నేతలు సందర్శించారు. పోలీసుల దాడిలో గాయపడిన నిర్వాసితులను పరామర్శించారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్, సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు కరీంనగ్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిర్వాసితులను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పరామర్శించారు. పోలీస్ లాఠీఛార్జ్‌లో గాయపడిన వారికి సానుభూతి తెలిపారు. వారికి సంఘీభావం ప్రకటిస్తూ.. తెరాస సర్కార్ తీరుపై, సిద్దిపేట జిల్లా పోలీసు యంత్రాంగంపై మండిపడ్డారు. గుడాటిపల్లిలో గౌరవెల్లి భూనిర్వాసితుల పోరాటానికి తాము మద్దతిస్తామని చెప్పారు.సిద్దిపేట జిల్లాలో గౌరవెల్లి భూనిర్వాసితుల ఆందోళన కొనసాగుతోంది. పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిరసన వ్యక్తంచేస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని నిర్వాసితులు తేల్చిచెప్పారు.

## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళన

మొదటిపేజీ తరువాయి..

రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఫ్యాకల్టీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతునామని చెబుతున్నారు. నాసిరకం భోజనం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సీఎం కేసీఆర్ లేదా కేటీఆర్ కాలేజీని సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు నిరసన కొనసాగిస్తా మని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొనడానికి వచ్చిన తల్లిదండ్రు లను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా విద్యార్థుల సమస్యలపై మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. బాసర ఆర్జీయూకేటీ విద్యార్థుల లేవనెత్తిన అన్ని అంశాలను సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల నిరసన కొనసాగుతోంది. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనను విరమించే ప్రసక్తేలేదని విద్యార్థులు అన్నారు. ఈ నేపథ్యంలో బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న పరిస్థితులపై చర్చించేందుకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నత విద్యామండలి అధికారులు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో జరిపిన చర్చల సారాంశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలుసుకున్నారు. మరోవైపు బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలెక్టర్ జరిపిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. సమస్యలకు సరైన పరిష్కారం చూపకపోవడంతో విద్యార్థులు చర్చల నుంచి బయటకు వచ్చేశారు. కేవలం రూ.10లక్షల విలువైన పనులకు నిధులు కేటాయిస్తామని కలెక్టర్ చెప్పడం, సీఎం కేసీఆర్ క్యాంపస్ ను సందర్శించే ప్రసక్తే లేదని స్పష్టం చేయడంపై స్టూడెంట్స్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆందోళన కొనసాగించాలని నిర్ణయించారు. బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విద్యార్థులు లేవనెత్తిన అంశాలను సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఆందోళన చెందవద్దని సూచించారు.విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కారని తేజాగౌడ్ అనే విద్యార్థి మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించారు.

## దేశ వ్యవసాయ స్వరూపం మారాలి

**యాంత్రీకణకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**సాంకేతికతను పూర్తిగా వినియోగించాలి**
**నూతన ఆవిష్కరణలతోనే యువతకు ఉపాధి**
**వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి**

హైదరాబాద్,జూన్15: దేశ వ్యవసాయ స్వరూపం మారాలని, యాంత్రీకరణ, సాంకేతికతను సంపూర్ణంగా అమలు చెయ్యాలని తద్వారా రైతుల ప్రయోజనాలుకాపాడేందుకు వీలుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాలలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికతతో యువతకు ఉపాధి లభించాలని అన్నారు. దీనిమూలంగా వ్యవసాయరంగంలో యాంత్రీకరణ అందుబాటులోకి రావడమే కాకుండా, రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన అధిక సాంద్రతతో పత్తి సాగుపై క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన సదస్సులో మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాగులో నూతన శకానికి నాంది పలికాం, సాంప్రదాయ సాగునుండి ప్రపంచ సాంకేతికతను తెలంగాణ వ్యవసాయానికి అన్వయించు కోవాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని అన్నారు.మనకున్న వ్యవసాయాన్ని ఉజ్వలమైన వ్యవసాయంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.కేవలం అధిక మోతాదులో పంటలు పండించడమే కాదు. అవసరమైన పంటలు, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు, రైతుకు రాబడినిచ్చే పంటలు పండించాలని నిర్ణయించామన్నారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించి రాష్ట్ర ఆదాయం, దేశ ఆదాయం పెంచేలా తెలంగాణ వ్యవసాయం ముందుకుసాగాలని కోరారు. మూడేళ్లుగా రైతులను అప్రమత్తం చేస్తున్నాం.జిల్లాల వారీగా సదస్సులతో ఏ పంటలు వేయాలి అన్న విషయాన్ని రైతులకు వివరించాం. రైతులు కూడా పంటల వైవిధ్యీకరణకు సానుకూలంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ప్రపంచ అవసరాలకు సరిపడా పత్తి ఉత్పత్తి కావడం లేదు. ప్రపంచంలో పత్తి అత్యధికంగా సాగయ్యేది భారతదేశంలోనే అని చెప్పారు.3.20 కోట్ల ఎకరాలలో దేశంలో పత్తి సాగు అవుతున్నది. మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా తర్వాతి స్థానాలలో తెలంగాణ, గుజరాత్ లు ఉన్నయననారు.ఈ సమావేశంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అధ్వానం

మొదటిపేజీ తరువాయి..

అఘాయిత్యాలకు పాల్పడిన వారికి 56 రోజుల్లోనే శిక్ష విధించిన విషయాన్ని శ్రవణ్ గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ ఇలాంటి పద్ధతి అవలంబించి నేరం చేస్తే శిక్ష పడుతుందన్న భయం వచ్చేలా చేయాలని అన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ల సంఖ్య పెంచడంతో పాటు.. వారి కోసం ప్రత్యేకంగా మూడంకెల నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయని.. దీనిపై కఠినంగా వ్యవహరించాలని శ్రవణ్ పేర్కొన్నారు. స్ట్రీట్ లైట్లు ఉంచాలని.. బహిరంగ కాలకృత్యాలు లేకుండా చూసుకోవాలన్నారు. డ్రగ్స్, మద్యం అరికట్టాలన్నారు. మహిళల రక్షణ కోసం ఒక ప్రత్యేక కార్యచరణ తయారు చేద్దామని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు.

## ఎనిమిదేళ్లలో ఆదర్శంగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి..

మంజూరుకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారని అన్నారు. త్వరలోనే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో తాగునీటి సౌకర్యంతోపాటు ట్రాక్టర్, ట్రాలీ, వైకుంఠ ధామం, నర్సరీలు, పల్లె ప్రకృతి వనం, రోడ్లు, డ్రైనేజీలు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. వెంకట్రావుపల్లెలో విరాసత్ సహా అన్ని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. గ్రామానికి సాగునీటి సౌకర్యం కల్పిస్తామని, సొంత జాగాలో ఇండ్ల నిర్మాణం చేసుకునే వారికి ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. పాధి కల్పనలో దేశంలో తెలంగాణ ముందుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలతోపాటు ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. నలుగురికి ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చేవారిని ప్రోత్సహిస్తామన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. దేశంలో 65 శాతం జనాభా 35 ఏండ్ల లోపువారేనని తెలిపారు. 80 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పక్రియ ప్రారంభమైందని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి అన్నివిధాల అండగా ఉంటామని చెప్పారు. ఇంటింటికీ తాగు నీరు ఇస్తున్నామని, ఎండా కాలంలోను చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయన్నారు. 8ఏళ్లలో తెలంగాణ గ్రామాలు,పల్లెలను దేశానికే ఆదర్శంగా నిలిపామని కేటీఆర్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయితీలో త్రాగునీటి సౌకర్యంతో పాటు వైకుంఠధామం, నర్సరీలు, పల్లె ప్రకృతి వనం, రోడ్లు, డ్రైనేజీలు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గ్రామంలో కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి విరాసత్ సహా అన్ని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఇక సొంత జాగాలో ఇండ్ల నిర్మాణం చేసుకునే వారికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అంతకుముందు మేడ్చల్‌లో కొత్తగా నిర్మించిన మినీ స్టేడియాన్ని మంత్రి మల్లారెడ్డితో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని మున్సిపాలిటీల్లో మినీ స్టేడియాలు ఏర్పాటుచేస్తామన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. ఈ మూడు నెలల పాటు ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివి.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉద్యోగార్థులకు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. మొబైల్స్ వాడకాన్ని తగ్గించాలని పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు కేటీఆర్ సూచించారు.

## రాష్ట్రంలో మరో 11 వృద్ధాశ్రమాలు

మొదటిపేజీ తరువాయి..

ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, అసోసియేషన్ ప్రముఖులు నర్సింహారావు, వెంకటయ్య గౌడ్,



నర్సింహారెడ్డి, ప్రతాపరెడ్డి, నర్సయ్య, హరి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సింగ్ కాలేజీని పరిశీలించిన స్పీకర్

**వసతులపై విద్యార్థులతో ఆరా**

కామారెడ్డి,జూన్15: బాన్సువాడ బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని బుధవారం రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. వసతి గృహంలోని సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనం బాగుంటుందా అని విద్యార్థినులను స్పీకర్ అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థినులు తెలుపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే నాణ్యతా ప్రమాణాలు కొనసాగించాలని, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను స్పీకర్ ఆదేశించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, తదితరులు ఉన్నారు.

## రాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

మొదటిపేజీ తరువాయి..

ఇక రాష్ట్రపతి ఎన్నికకు జులై 18న పోలింగ్ నిర్వహించి, 21న ఫలితాలను విడుదల చేయనున్నారు. కొత్త రాష్ట్రపతి జులై 25న ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నది. ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పదవీకాలం జులై 24న ముగియనుంది. నోటిఫికేషన్ విడుదలతో దేశ ప్రథమ పౌరుడు రాష్ట్రపతి ఎన్నిక పక్రియ ప్రారంభమైంది. జూన్ 29 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశమిచ్చారు. జూన్ 30న నామినేషన్ పత్రాలను పరిశీలించనున్నారు. ప్రస్తుత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పదవీ కాలం జులై 24తో ముగియనుంది. ఈ క్రమంలో ఆ ఖాళీని భర్తీ చేసేందుకు ఈసీ సిద్ధమైంది. జులై 25న కొత్త ప్రెసిడెంట్ ప్రమాణ స్వీకరం చేయనున్నారు. భారతీయ పౌరులై ఉండి 35 ఏళ్ల వయసు కలిగిన వారు రాష్ట్రపతి పదవికి పోటీ చేయవచ్చు. అయితే వారు లోక్ సభ సభ్యులు అయ్యేందుకు అవసరమైన అర్హతలు కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో గానీ, లాభదాయక పదవుల్లో కొనసాగరాదు. దేశ ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి ఎన్నిక ఆషామాషీ వ్యవహారం కాదు. లోక్ సభ సభ్యుడికి ఉండాల్సిన అర్హతలన్నీ ఉండి 35 ఏండ్లు నిండిన భారత పౌరులెవరైనా రాష్ట్రపతి పదవికి పోటీ చేయొచ్చు. అయితే వారు ఏ చట్టసభల్లో ప్రతినిధిగానూ, లాభదాయక పదవుల్లోనూ ఉండకూడదు. రాజ్యసభ ఎంపీల మాదిరిగానే దేశ ప్రథమ పౌరుడి ఎన్నిక కూడా పరోక్ష విధానంలో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ రాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. పార్లమెంటు, అసెంబ్లీల్లో నామినేటెడ్ సభ్యులు, శాసనమండలి సభ్యులకు ఓటు హక్కు ఉండదు. రాజ్యాంగంలోని ఆర్టికల్-324 ప్రకారం 'ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా' రాష్ట్రపతి ఎన్నికలు నిర్వహిస్తుంది. రాష్ట్రపతి ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. పార్టీలు విప్ జారీ చేయడానికి వీల్లేదు. దేశంలో ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎంపీలు సంఖ్య 4,809 కాగా వారి ఓటు విలువ 10,86,431. ఎలక్టోరల్ కాలేజీలోని ప్రతి సభ్యుని ఓటుకు ఒక విలువ ఉంటుంది. ఇది ఎంపీలకు ఒక విధంగా, ఎమ్మెల్యేలకు మరో విధంగా ఉంటుంది. లోక్ సభలో 543, రాజ్యసభలో 233 మందితో కలుపుకొని మొత్తం 776 మంది ఎంపీలున్నారు. అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన ఢిల్లీ, పుదుచ్చేరితో కలుపుకుని మొత్తం 4,033 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వాస్తవానికి ఈ సంఖ్య 4,120. కానీ 2018లో కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన జమ్ముకశ్మీర్‌లో ఇంకా ఎన్నికలు జరగకపోవడంతో ఈ సంఖ్య తగ్గింది. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఎమ్మెల్యేలు, ఎంపీల ఓటు విలువను నిర్ధారిస్తారు. తొలుత రాష్ట్ర జనాభాను ఆ రాష్ట్రంలోని ఎమ్మెల్యేల సంఖ్యతో భాగిస్తారు. వచ్చే విలువను మళ్లీ 1000తో భాగిస్తారు. అలా వచ్చే సంఖ్యే రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఓటు విలువగా పరిగణిస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎమ్మెల్యేల ఓటు విలువను మొత్తం ఎంపీల సంఖ్యతో భాగించి ఓటు విలువ నిర్ధారిస్తారు.

రాష్ట్రపతి ఎన్నిక ప్రపోషనల్ రిప్రెజంటేషన్ పద్ధతిలో సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటింగ్ విధానంలో జరుగుతుంది. అంటే ఎన్నికలో ఓటర్ల అందరికీ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తారు. సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటింగ్ విధానంలో ఒకరికంటే ఎక్కువ మంది పోటీ చేస్తే ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థులకు ఓటు వేయాల్సి ఉంటుంది. అంటే ఓటరు బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా ఒకటి, రెండు, మూడు, నాలుగు ఇలా ప్రాధాన్యతలవారీగా ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారు గెలిచినట్లు కాదు. నిర్దేశిత కోటా కంటే ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.



జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామానికి చెందిన యం.రచనకు 60 వేలు, రాధ కు మంజూరైన 12 వేల రూపాయల విలువగల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్. పాల్గొన్న ఏళ్ల రాజన్న, ఆనంద్ రావు, పులి నర్సయ్య, ఆరిఫ్, క్యాదాసు నవీన్ తదితరులు



జగిత్యాల పట్టణ 29వ వార్డ్ కి చెందిన ఏ. లక్ష్మి కి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 1 లక్ష విలువ గల చెక్కును ఇంటికి స్వయంగా వెళ్లి అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్. పాల్గొన్న వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ పంబాల రామ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, కౌన్సిలర్ రజీ, జిలానీ

## దళితుల సామాజిక ఆర్థిక అభివృద్ధికే దళిత బంధు

### - ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ 11 వ వార్డ్ కు చెందిన దుబ్బలింగయ్య కు, రౌట్ల రాజేష్ కు దళిత బంధు పథకం ద్వారా మంజూరైన గూడ్స్ వాహనాలను లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. అనంతరం మాట్లాడుతూ.... దళితులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ముఖ్యమంత్రి దళిత బందు పథకాన్ని అమలు చేస్తున్నారని, స్వతహాగా వ్యాపారం చేస్తూ సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆర్థికంగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ప్రపంచంలోనే దళిత బంధు లాంటి గొప్ప పథకం ఎక్కడా



లేదని దళితుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని, దళితులు ముఖ్యమంత్రి పక్షాన నిలబడి అండగా ఉండాలని అన్నారు. వెంట పట్టణ టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 2వ వార్డులో 4వ విడత పట్టణ ప్రగతి

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** జనగామ మున్సిపల్ పరిధిలో 4 విడత పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 2వ వార్డులో బుధవారం అడిషనల్ కలెక్టర్ అబ్దుల్



హమీద్, మున్సిపల్ కమీషనర్ రవిందర్ యాదవ్, స్థానిక వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ అనిత సందర్శించారు. కౌన్సిలర్ పలు సమస్యలను అడిషనల్ కలెక్టర్, కమిషనర్ లకు వివరించారు. పట్టణ ప్రగతి లో భాగంగా వార్డ్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, యాకూబ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మధు, పుష్ప, లైన్ ఇన్స్పెక్టర్ రవీందర్, వార్డ్ సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయులతో కలిసి అల్పాహారం చేసిన వోరగంటి

**మానకొండూర్ జూన్ 15 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూర్ గ్రామంలో స్థానికులు ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో



తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యులు వోరగంటి ఆనంద్ పాల్గొని అల్పాహారం తింటూ స్థానికులతో ముచ్చటిస్తూ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెరాస నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వోరగంటి యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కులాంతర వివాహం చేసుకున్నవారికి ప్రోత్సాహక బాండ్ అందజేత

**జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 4 గురు కులాంతర వివాహం చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రోత్సహక బాండ్ రూ. 2.5 లక్షలను లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. పాల్గొన్న మున్సిపల్ ఛైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డిఎస్ డిఓ రాజ్ కుమార్, కమిషనర్ స్వరూప రాణి, అధికారులు అంజయ్య, కృష్ణ, కౌన్సిలర్ లు బాలే లత శంకర్, రజీయొద్దీన్, నాయకులు ఆనంద్ రావు, రాజ్ కుమార్ తదితరులు.



## ఇందుర్తిలో ముగిసిన చిరుతల రామాయణం

**చిగురుమామిడి జూన్ 15 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో చిరుతల రామాయణం మూడు రోజులపాటు ఏర్పాటు చేయగా ముగింపు కార్యక్రమంలో ఎస్.ఐ. దాస సుధాకర్ వృక్ష ప్రదాత జనపరెడ్డి సురేందర్ రెడ్డి





పాల్గొన్నారు. అనంతరం ఎస్.ఐ.దాస సుధాకర్ మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాచీన కళలను కాపాడుకుంటూ నేటి తరానికి రామాయణం చరిత్ర తెలియజేయడం పట్ల కళాకారులు మండలంలోనే ముందు ఉన్నారన్నారు. ఇప్పటి కంప్యూటర్ యుగానికి యువత అలవాటు పడి చెడు దారులకు వెళ్లకుండా అప్పటి రామాయణం మహాభారతం చూసి నేర్చుకోవాలి అన్నారు. రాముని లోని మంచి రావణాసురుని చెడును గమనించి అప్పుడే ఈ రామాయణానికి అర్థం ఉంటుంది. అనంతరం మధ్య వయసుకు పైబడినవారు సైతం రామాయణం లోని రాముడు, సీత, లక్ష్మణుడు, రావణాసురుడు, హనుమంతుని వేషధారణలతో ఆకట్టుకున్నాయన్నారు. అనంతరం మూడు రోజుల పాటు రామాయణంలో పాల్గొన్న కళాకారులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కళాకారులను అభినందించారు. అనంతరం ఎస్.ఐ. ని శాలువాతో సన్మానించారు. వృక్ష ప్రదాత జనపరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.... మండలం లోని కళాకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని వారికి సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తామని తెలిపారు జన్నపరెడ్డి సురేందర్ రెడ్డితో పాటు గవ్వ వంశీధర్ రెడ్డి ని శాలువాలతో కళాకారులు ఘనంగా సన్మానించారు. రామాయణం చూడడానికి ఇందుర్తి గ్రామం తో పాటు ఒగ్లాపూర్ గగిరెడ్డిపల్లె గునుకుల పల్లె చుట్టుపక్కల గ్రామాలతో పాటు తదితర గ్రామాల నుండి ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. చివరి రోజు బుధవారం ఉదయం నుండి రామునికి పట్టాభిషేకం ఒడి బియ్యంతో మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సీతారాముల కల్యాణానికి పుస్తె మట్టలు పట్టువస్త్రాలు స్థానిక వార్డు సభ్యులు అందే పుల్లయ్య దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వరూప స్వామి, ఎంపీటీసీ అందే స్వప్న చిన్న స్వామి, రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వంగ సుధాకర్ ఆధ్వర్యంలో కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజకుమార్, బోల్ల కొమరయ్య పంతులు, చంద బోయిన పరుశరాములు, సంపత్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి, రైతు సంఘం నాయకులు కాంతల శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ తోట సతీష్, గగిరెడ్డిపల్లె ఉపసర్పంచ్ అన్నాడ మల్లికార్జున్ రెడ్డి, వార్డు సభ్యులు వివిధ గ్రామాల కళాకారులు, చంద్రారెడ్డి సొన్నాయిల భరత్, కుతుబుద్దీన్ చంద్రయ్య, కొమరయ్య, కిటయ్య, ప్రశాంత్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీలో ఘనంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు

### రోగులకు పండ్లు పంపిణీ చేసిన మాజీ మేయర్ కార్తీకరెడ్డి

**సికింద్రాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, నార్త్ ఈస్టర్న్ రీజియన్ డెవలప్మెంట్ శాఖల మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు గంగాపురం కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావుతో కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 500 మంది నిరుపేద రోగులకు పలు రకాల పండ్లు, బ్రెడ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ కార్తీకరెడ్డి మాట్లాడుతూ... మంత్రి కిషన్ రెడ్డి సూచన మేరకు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. దేశ నేతలు, నాయకుల పుట్టినరోజుల, శుభకార్యాల సందర్భాల్లో ఇకపై సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిభిరాలు నిర్వహిస్తామని ప్రకటించారు. అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో లేక వేలాది మంది మృత్యువాత పడుతున్నారని, అటువంటి వారికి రక్తదానం చేసి పునర్జన్మ ప్రసాదిస్తామని తెలిపారు. మంత్రి కిషన్ రెడ్డి జన్మదినాన్ని నిరుపేద రోగుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని, ఆయన నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో



ఉండాలని, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చికిత్స పొందుతున్న రోగులు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, ఆర్ఎంఓ - 1 జయకృష్ణ, బ్లడ్ బ్యాంకు ఇంఛార్జీ సత్యరత్న, బీజేపీ నాయకులు బండ చంద్రారెడ్డి, వీరన్న, కనకట్ల హరి, నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి, లడ్డు, రాజేష్, హన్మంతు, సంపత్, దత్తు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ప్రభుత్వం భరోసా

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ఆసరాగా నిలుస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ ఉప్పల్ లో మేకల భారతి గార్డెన్స్ లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధుల



వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.... సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం తరపున వృద్ధులకు వసతి గృహాలు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.... భూటాన్ దేశం లో వలె తెలంగాణ లో హ్యాపీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. తన తల్లిదండ్రులే తన రాజకీయ అభివృద్ధికి కారకులని వారి రుణం తీర్చలేనిదని, శత కోటి దండాలు అని కీర్తించారు. సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. నర్సింహారావు మాట్లాడుతూ.... వయోవృద్ధులపై పిల్లల వేధింపుల నివారణకు తమ అసోసియేషన్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేధింపుల నుంచి వృద్ధుల రక్షణకు పోలీసులు సత్వరం స్పందించాలన్నారు.

15 వ ఆగస్టు నాడు పాఠశాలల్లో విద్యార్థులకు తల్లిదండ్రుల పోషణ సంక్షేమం, రక్షణ, గౌరవము అంశాలపై వ్యాస రచన పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తమ అసోసియేషన్లు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, జగిత్యాల జిల్లా నుంచి జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, జిల్లా సహాయ అధ్యక్షుడు పి.సి. హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు యాకూబ్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు అలిశెట్టి ఈశ్వరయ్య, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాయికల్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం -ఎమ్మెల్యే సంజయ్

**రాయికల్ జూన్ 15 (ప్రజా మంటలు) :** రాయికల్ పట్టణంలో



సెంట్రల్ లైటింగ్ ను ప్రారంబించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాయికల్ గ్రామాన్ని మున్సిపల్ గా మార్చడం జరిగిందని, సుందరంగా మార్చడానికి తగినట్లు గానే నిధులు మంజూరు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.రాయికల్ పట్టణంలో రోడ్లు,మినీ టాంక్ బండ్,సీసీ కెమెరాలు,కుల సంఘాల భవనాలకు నిధులు కేటాయంచామని, రాయికల్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాంట్రాక్ట్ నిర్లక్ష్యం వల్ల కొంత అభివృద్ధి ఆలస్యం అయిందని,కొత్త వారిని టెండర్ కు పిలవాలని అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం కూడా తప్పనిసరి అని,తడి పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని,ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మోర హనుమండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి,గన్నే రాజిరెడ్డి, మల్లారెడ్డి, కమిషనర్ సంతోష్, కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## "ప్రపంచ వయోవృద్ధుల వేదింపులపై అవగాహన దినోత్సవం" పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సి హెచ్ శివలింగయ్య "ప్రపంచ వయోవృద్ధుల వేదింపులపై అవగాహన దినోత్సవం" పోస్టర్ ని




అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశంలో వయోవృద్ధులకు పోషణ చట్టం 2007, 2019 అమలుచేస్తుందని, అధనంగా భారత దేశ ప్రభుత్వం వయోవృద్ధులు, తమ పైన నిర్లక్ష్య వైఖరి, మానసిక, శారీరక, ఆర్థిక, లైంగిక వేదింపులకు గురవుతున్న ఏ వృద్ధులైన వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ తెలంగాణా ప్రభుత్వం అధినంలో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 14567 కు ఫోన్ చేయాలని, 2020 ఏప్రిల్ నుండి నేటి వరకు టోల్ ఫ్రీ నెంబర్ 14567కు వచ్చిన వయోవృద్ధుల ఫిర్యాదుల సంఖ్య 121, ఇప్పటికి పూర్తిగా విచారించి 120 ఫిర్యాదులు పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సంపత్ కుమార్, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ తిరుపతిరెడ్డి, సుధాకర్ , ఐసిపీయస్, ప్రణయ్. పోషణ అభ్యాన్ శేఖర్, చైల్డ్ లైన్ నాగరాజు పాల్గొన్నారు.



## మైనారిటీ కాలనీలో 4వ విడత పట్టణ ప్రగతి

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** జనగామ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మైనారిటీ కాలనీలో బుధవారం జాయింట్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, వార్డ్ కౌన్సిలర్ పేర్ని స్వరూప సందర్శించారు. వార్డులోని పలు సమస్యలు ఈ సందర్భంగా గుర్తించారు. పిచ్చి మొక్కలు తొలగించినవి గమనించారు. మైనారిటీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ ను పరిశీలించారు. డ్రెయినేజీ సమస్యలను గుర్తించారు. మైనారిటీ కాలనీలో మజీద్ పై ఉన్న కరెంట్ వైర్ల వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని కౌన్సిలర్ పెర్ని స్వరూప వివరించగా అడిషనల్ కలక్టర్ ప్రత్యేకంగా వీక్షించి వెంటనే స్పందించి తొలగించడానికి అయ్యే ఖర్చును తామను భరిస్తానని ప్రకటించి ప్రస్తుతం రూ. 20 వేలు స్వయంగా ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు స్పెషలాఫీసర్ ప్రియాంక, మున్సిపల్ ఆఫీసర్ రవి, ఆర్ పి సమీనా, శ్రీమతి వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్స్ కోసం హైద్రాబాద్ తరలింపు

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో గత వారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైనవారిని హైద్రాబాద్ తరలించారు. ఇందులో 86 మందికి ఆపరేషన్స్ అవసరమని నిర్ణయించి, గత వారం ఆపరేషన్స్ చేసుకున్న 34 మందిని ఉచితంగా బస్ లలో హైదరాబాద్ లోని ఎం.ఎస్. రెడ్డి లయన్స్ కంటి హాస్పిటల్ కి ఉచిత కంటి ఆపరేషన్స్ కోసం పంపించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా కంటి



అద్దాలను అందజేశారు. కంటి జబ్బులకు సంబంధించిన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు జైన రమేష్, జోన్ చైర్మన్ తీరుపల్లి కృష్ణారెడ్డి, యెడమ సంజీవ రెడ్డి, కార్యదర్శి యెడమ మోహన్ రెడ్డి, తొడుపునూరి వెంకట నారాయణ, కాబోయే అధ్యక్షులు కూతటి ఉప్పలయ్య, అనిత, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పాషా కుటుంబాన్ని పరామర్శించిన ఎం.పి.పి. చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన జనగామ టౌన్



సీనియర్ ఏబిఎన్ రిపోర్టర్ పాషా (అబ్దుల్ ఖాదర్) రోడ్డు ప్రమాదవశాత్తు మృతి చెందగా, వారి కుటుంబాన్ని కుందారం గ్రామంలో జనగామ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షురాలు, లింగాల ఘణపురం ఎంపీపీ చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పాషా చిత్ర పటానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ధైర్యం చెప్పి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెరాస రాష్ట్ర నాయకులు చిట్ల ఉపేందర్ రెడ్డి, లింగాల ఘణపురం మండల ఎస్.సి. సెల్ అధ్యక్షులు నల్ల అశోక్, నెల్లుట్ల గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల రాహుల్, రాజన్న యువసేన మండల అధ్యక్షులు బోట్ల రవి, బర్ల సంపత్, నల్ల సుధీర్, నల్ల కమలకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామానికి చెందిన కందుల మల్లయ్య, పొకల తిరుపతి రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించగా పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు వోరగంటి ఆనంద్. పాల్గొన్న స్థానిక టిఆర్ఎస్ నాయకులు



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో నూతన మార్కెట్ కార్యాలయాన్ని హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ కాసర్ల అశోక్ బాబు ప్రారంభించారు. పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అనిత రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

# మళ్లీ భయపెడుతున్న కరోనా !

కరోనా ముప్పు ఇంకా ఉందని, అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ హెచ్చరించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా వైద్య యంత్రాంగాలను సమాయత్తం చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అయూరప్ దేశాలలో రికార్డు స్థాయిలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. భారత్‌లో కూడా కేసులు స్పందందుకున్నాయి. రోజుకు వేయికి పైగానే కేసులు నమోదు అవుతున్నాయి.కేసులు పెరుగుతున్నా జనం ఏమాత్రం భయ పడుతున్నట్టు లేదు. నిబంధనలు గాలికి వదిలేసి తిరుగుతున్నారు. రద్దీ ప్రాంతాల్లో భౌతిక దూరం మచ్చుకైనా కనిపించడం లేదు. భుజం భుజం రాసుకుంటూ కనిపిస్తున్నారు. ఢిల్లీలోని ప్రధాన మార్కెట్ సెంటర్లన్నిటిలో ఇదే పరిస్థితి. జనం గుంపు గుంపులుగా కనిపిస్తున్నారు. కరోనా పీడ విరగడ అయ్యిందన్న భావనకు ప్రజలు వచ్చేశారు. అందుకే మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి అలవాట్లను వదులుకున్నారు. ఈ క్రమంలో క్రమంగా పెరుగుతున్న కేసుల కారణంగా మళ్లీ జాగ్రత్తలు అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వారం పదిరోజుల్లోనే పరిస్థితి మారింది. ముఖ్యంగా కర్నాటక, మహారాష్ట్ర మరోసారి హాట్ స్పాట్‌గా మారతున్నాయి. మహారాష్ట్ర లో కేసులు ఎక్కువ సంఖ్యలో వెలుగు చూశాయి. రాబోవు రోజులలో మహారాష్ట్రలో కేసుల ఉధృతికి ఇది సంకేతం. దాంతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలకు ఉపక్ర మించింది. ఇంత జరుగుతున్నా చాలా చోట్ల జనం కనీసం ముఖానికి మాస్కులు కూడా పెట్టుకోని పరిస్థితి కనిపిస్తుంది. మహారష్ట్రలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొత్తగా నమోదవుతున్న కేసులలో హెచ్చుతగ్గులు ఉన్నా కేసులు సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నపిల్లలకు కూడా కరోనా టీకా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో వారికి కూడా వ్యాక్సిన్ ఇచ్చే అవకాశం ఏర్పడింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించే బాధ్యత తీసుకోవాలి. అలాగే ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలి. అప్పుడే కొంతయినా రక్షణ కలుగుతుంది. శీతల వాతవరణంలోనే కరోనా బతుకుతుందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇకపోతే వేడి పదార్థాలను తినడం అలవాటు చేసు కోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అందువల్ల ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇకపోతే కరోనా వైరస్ నుంచి రక్షించుకునేందుకు యునిసెఫ్ కొన్ని సూచనలు చేసింది. వైరస్ ఎక్కడ, ఎంత సేపు బతుకుతుందో తెలియచేసింది. అది సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించింది. కరోనా గాలి నుంచి సోకదని, వస్తువులపై మాత్రమే ఉంటుందని తెలిపింది. వైరస్ అంటిన వస్తువులను ముట్టుకుని నోరు లేదా ముక్కు దగ్గర చెయ్యి పెడితేనే వైరస్ అంటుతుంది. వస్తువుల మీద ఉన్న వైరస్ బతికేది కేవలం 12 గంటలే. నీళ్లు, సబ్బుతో కడిగితే వైరస్ పోతుంది. బట్టలపై 9 గంటల పాటు వైరస్ బతుకుతుంది. రెండు గంటలు ఎండలో ఆ బట్టలను పెడితే వైరస్ చచ్చిపోతుంది. 6 నుంచి 27 డిగ్రీల టెంపరేచర్ వద్ద వైరస్ బతకదు. కాబట్టి మన దగ్గర దాని మనుగడ అంతంత అయినా జాగ్రత్తలు తీసుకుని ముందుకు సాగాలి. వేడి నీళ్లు తాగడం, ఎండకు ఉండడం ద్వారా వైరస్‌ను చంపేయొచ్చు. ఐస్ క్రీమ్, కూల్‌డ్రింకుల వంటి వాటిని తీసుకోకపోవడం మంచిది. వైరస్‌లోని కణం సైజు 400 నుంచి 500 మైక్రాన్లు ఉంటుంది. చేతులపై వైరస్ ఉండేది కేవలం 10 నిమిషాలే. శానిటైజర్లతో కడిగితే వైరస్‌ను చంపే యొచ్చు. వేడి ఉప్పు నీటితో



గార్లింగ్ చేస్తే ట్రాన్సిల్స్‌కు కారణమయ్యే క్రిములను చంపేయొచ్చు. విద్యా సంస్థలు నడుస్తున్నందున విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు కరోనా రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు జర్వం, జలుబు లాంటి ఉంటే వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని నిపునులు సూచిస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని తెలపారు. తరచూ చేతులు కడుక్కోవాలి. తుమ్ములు, దగ్గు వచ్చేటప్పుడు కర్చీఫ్ లేదా టీష్యూ అడ్డుపెట్టుకోవాలి. దీని ద్వారా కరోనా వైరస్‌తో పాటు ఇన్‌ఫ్లూయెంజా లాంటి పలు అంటువ్యాధులను నివారించవచ్చని నిపుణుల బృందంద తెలిపింది. విద్యార్థులు, యువతకు ఈ సమాచారం తెలియజేయడం ద్వారా మరింత మందికి అవగాహన కల్పించ వచ్చు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలని కోరింది. వ్యాక్సిన్‌తో పోల్చుకుంటే.. సహజ ఇన్ఫెక్షన్ అనేది ఏ వేరియంట్ నుంచి కాపాడలేదని చెప్పారు.కరోనా వల్ల దీర్ఘకాలంలో ప్రభావాలు ఉండొచ్చని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచించారు. మైల్డ్ సింప్టమ్స్ తర్వాత.. కీలక అవయవాల్లో 6 నెలలకంటే ఎక్కువ కాలం వైరస్ ఉంటుందని తేలింది. పోస్ట్ కొవిడ్ సమస్యలతో బాధపడుతున్న వాళ్లను, లాంగ్ కొవిడ్ పేషెంట్లను చూస్తున్నాం. మరోవైపు దేశంలో కరోనా కేసులు ఓ స్థాయిలో నమోదవుతున్న తీరు ఆందోళనకు కారణం అవుతోంది. కేసులు పెరుగు తుండటంతో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో నిబంధనలు అమలు చేస్తున్నారు. ప్రజలు వ్యాధి వ్యాప్తికి కారణం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. అప్పుడే కరోనాను కట్టడి చేయగలమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# అన్నదమ్ములు

శ్రీపురం లో ఉన్న ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆస్తి వాటాలో తగాదాలు వచ్చాయి.ప్రతి రోజు అన్నదమ్ములు ఇద్దరూ ఘర్షణ పడే వారు. అన్న స్వతహాగా సౌమ్యుడు, తమ్ముడు దుడుకు . వారసత్వంగా వారికి వచ్చిన వ్యవసాయ భూమి ఐదు ఎకరాలు మాత్రమే. ఇంతవరకు కలసి వ్యవసాయం చేసికొని, వచ్చే మొత్తం లో సరి సమానంగా పంచుకునే వారు. ఆ యేడు పంట విరగ కాసింది.మంచి లాభం వచ్చింది. ఆ డబ్బు చూసి తమ్మునికి కన్ను కుట్టింది. నా వాటా భూమి పంచుకుంటే, వచ్చే లాభం నా సొంతం అవుతుంది అనే ఆలోచన వచ్చింది. అదే విషయం అన్నను అడిగితే "వద్దురా ఇప్పుడు ఉన్న దానితో మనం సుఖంగా ఉన్నాం ఆ ఆలోచన మానుకో " అన్నాడు. అందుకు ససేమిరా అన్నాడు తమ్ముడు.

" ఐదు ఎకరాలలో చేనును కోత (కట్) చేయడం నాకు మనసొప్పడం లేదు " అన్నాడు అన్న. " అయితే నువ్వు పెద్ద మనసు చేసుకుని నాకు మూడు ఎకరాలు ఇవ్వు.మిగతాది నువ్వు తీసుకో, నేనడిగేది అర ఏకరమేగా " అన్నాడు.

" సరే నువ్వు చెప్పినట్లు మూడు ఎకరాలు తీసుకో " అని గుర్తులు వేశాడు అన్న. తనకు అదనంగా అర ఎకరం వచ్చిందని తెగ ఆనంద పడ్డాడు తమ్ముడు. తనకు వచ్చిన రెండు ఎకరాలలో బోరు వేసి అరటి చెట్లు పెట్టాడు అన్న. అది చూసి తమ్ముడు కూడా బోరు వేయగా నీళ్ళు పడలేదు.రెండు,మూడు చోట్ల వేశాడు. ఉహు ఎక్కడా నీరు పడ లేదు.

అప్పటికే డబ్బంతా ఖర్చు అయింది. ఇక చివరిగా అన్న వేసిన చోట దానికి సమాంతరంగా బోరు వేశాడు. అక్కడ నీళ్ళు పడ లేదు.డబ్బంతా అయిపోయి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. అది గమనించిన అన్న ఏమి తెలియనట్లు గా ఉన్నాడు. ఇంతలో అరటి. మంచి కాపుకు వచ్చింది, లాభాలు వచ్చాయి. తమ్ముడు కడు దీనంగా ఉంటే అన్ననే వెళ్ళి "



తమ్ముడు " అని ఆప్యాయంగా పిలిచాడు. ఆ మాటకు వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

" రా...రా భోజనం చేద్దువు గాని " అన్నాడు. ఆ మాటకు దుఃఖం ముంచుకు వచ్చింది "అన్నయ్య " అంటూ వాటేసుకున్నాడు.

" అన్నయ్య నాది తప్పు,నన్ను క్షమించు ఎప్పటిలా ఇద్దరం చేను చేసుకుందాం " అన్నాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ." సరే లేరా, నువ్వు మారావు అదే నాకు చాలు. కలసి ఉంటే కలదు సుఖం అని ఊరికే అనలేదు మరి, పద ఎప్పుడు భోజనం చేశావో ఏమో " అన్నాడు అన్న.

" పద అన్నయ్య " అంటూ అన్న భుజం పై చేయి వేసుకుని వెళ్ళాడు తమ్ముడు. అన్నదమ్ములు ఇద్దరూ ఏకం కావడంతో ఊరి ప్రజలు సంతోషించారు.

–కనుమ ఎల్లారెడ్డి
93915 23027

# కేసీఆర్‌కు మాత్రమే దేశసారథ్యం సాధ్యం

## ప్రత్యామ్నాయ కూటమి కోసం ప్రజల ఎదురుచూపు

## కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగివేసారి పోయారు

## మంత్రి వేముల ప్రశాంత రెడ్డి అభిప్రాయం

నిజామాబాద్,జూన్15 : దేశ రాజకీయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిశితంగా పరిశీలిస్తున్నారని, అవసరమైనప్పుడు జాతీయ రాజకీయాల్లో తనవంతు పాత్ర పోషిస్తారని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతున్న బిజెపిని గద్దె దింపాల్సిన అసవరం ఉందన్నారు. తెలంగాణ బిజెపి నేతలు యాగీ చేయడం తప్ప రాష్ట్రానికి ఉపయోగపడే పనులు చేయడం లేదన్నారు. దేశానికి నాయకత్వం వహించే లక్షణాలు సీఎం కేసీఆర్‌కు ఉన్నాయని... సీఎం నేతృత్వంలో ప్రత్యామ్నాయ కూటమి ఏర్పడాలని ఆకాంక్షించారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఆయనతోనే దేశ రాజకీయాల్లో మార్పు సాధ్యమని అన్నారు. దేశంలో ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. బిజెపి ఎనిమిదేళ్ల పాలనతో విసిగి పోయారని అన్నారు. జిఎస్టీ వసూళ్లు, నోట్ల రద్దు, నిరుద్యోగం, పెట్రో ధరల పెంపుతో బిజెపి రంగు బయటపడిందన్నారు. థర్డ్ ఫ్రంట్‌కు నాయకత్వం వహించే శక్తి కేసీఆర్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. మోదీ నాయకత్వంలో బ్యాంకులు లూటీ అవుతున్నాయని, బ్యాంకుల స్కామ్ వెనుక మోదీ ప్రభుత్వం ఉన్నట్లుందని ఆరోపించారు. దేశ వనరులను కాంగ్రెస్, బీజేపీ ఉపయోగించుకోలేక పోయిందని వ్యాఖ్యానించారు. వామ పక్షాలు అభిప్రాయ భేదాలు పక్కన పెట్టి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తెలుగు ప్రజలు అందరూ మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగి వేసారి పోయారన్న మంత్రి వేముల అక్రమాలకు బిజెపి కేరాఫ్ అడ్రస్ అయిందన్నారు. బ్యాంకులు లూటీ అవుతుంటే ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలపాలన్నారు. ప్రజల సొమ్ముకు ఏ విధంగా భద్రత కల్పిస్తున్నారో చెప్పడం లేదన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్న మాజీమంత్రి.. వనరులను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచన కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నప్పుడు దేశంలో రైతులకు ఉచిత కరెంట్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇదిలావుంటే కెసిఆర్ నిర్ణయంతో విపక్షాలకు దిక్కుతోచకుండా పోయింది. కాంగ్రెస్, బిజెపిల కు అసలు అంశం లేకుండా పోయిందన్న భావన వస్తోంది. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్రపై సీఎం కేసీఆర్ గతంలోనే చేసిన ప్రకటన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కేసీఆర్ ప్రకటన తర్వాత ఇప్పుడు రాజకీయ చర్చలన్నీ ఆయన చుట్టూనే చర్చ కేంద్రీకృతమయ్యాయి. దేశవ్యాప్తం గా రాజకీయ వర్గాలతో పాటు రాష్ట్రంలోని సాధారణ ప్రజానీకం కూడా కేసీఆర్ జాతీయ రాజకీయరంగ ప్రవేశం,



అందుకు దారితీసిన పరిస్థితులు, పర్యవసానాలు, భవిష్యత్తులో చోటు చేసుకోనున్న పరిణామాలు, టీఆర్ఎస్ పార్టీలో అంతర్గత మార్పులపై ఊహాగానాలు, అంచనాలు సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలం నుంచి ఎత్తుగడలను వేయడంలో కెసిఆర్ సిద్ధహస్తుడు. జాతీయ రాజకీయాల్లో పెను మార్పులకు కెసిఆర్ కేంద్ర బిందువు కాగలరని కొందరు తాజా పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. మొత్తంగా కెసిఆర్ జాతీయ రాజకీయాలకు చేరువ అవుతున్నారని తెలుస్తోంది. నేతల వ్యాఖ్యలు కూడా దీనిని బలపరుస్తోంది. తాజాగా మంత్రి వేముల ఇటీవల బిజెపి తీరును విమర్శిస్తూ కెసిఆర్ తగిన సమయంలో తగు నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

# ప్రజాస్వామ్యంలో రాజరికాపు ఆనవాళ్ళు

## రాష్ట్రపతి ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

భారత 14వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పదవీ కాలం 2022 జులై 24తో ముగియనున్న నేపథ్యంలో జులై 25లోగా నూతన 15వ రాష్ట్రపతి కోసం 16వ సారి ఎన్నిక కావాల్సి ఉంది. 2022 జూన్ 9న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ భారత రాష్ట్రపతి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన ప్రకారం...జూన్ 15న రాష్ట్రపతి ఎన్నికలకు నోటిఫికేషన్, జూన్ 29 వరకు నామినేషన్ల స్వీకరణ, జూలై 2 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, జూలై 18న రాష్ట్రపతి ఎన్నికల్లో కీలకమైన పోలింగ్, జూలై 21న ఓట్ల లెక్కింపు జరగనుంది.

భారత దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు గవర్నర్ జనరల్ దేశాధి నేతగా ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, భారత దేశానికి ఇద్దరు గవర్నర్ జనరల్ గా పని చేసారు. స్వతంత్ర భారత గవర్నర్ జనరల్ గా లూయీ మౌంట్‌బాటెన్ ఆగష్టు 15, 1947 నుండి జూన్ 21, 1948 వరకు, అలాగే చక్రవర్తి రాజగోపాలా చారి జూన్ 21, 1948 నుండి జనవరి 26, 1950 వరకు పని చేశారు. తర్వాత 1950 జనవరి 26 న భారత రాజ్యాంగం అమలు లోకి వచ్చిన తరువాత దేశాధినేతగా రాష్ట్రపతి అయ్యారు. భారత రాష్ట్రపతులుగా వరుసగా...రాజేంద్ర ప్రసాద్ జనవరి 26, 1950 నుండి మే 13, 1962 వరకుబీ డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ మే 13, 1962 నుండి మే 13, 1967 వరకుబీ డా.జాకీర్ హుస్సేన్ మే 13, 1967 నుండి మే 3, 1969 వరకుబీ వరాహగిరి వేంకటగిరి మే 3, 1969 నుండి జూలై 20, 1969 వరకుబీ జస్టిస్ ఎం.హిదయతుల్లా జూలై 20, 1969నుండి ఆగష్టు 24, 1969 వరకుబీ వరాహగిరి వేంకట గిరి ఆగష్టు 24, 1969నుండి ఆగష్టు 24, 1974 వరకుబీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ఆగష్టు 24, 1974 నుండి ఫిబ్రవరి 11, 1977 వరకుబీ బి.డి.జట్టి ఫిబ్రవరి 11, 1977 నుండి జూలై 25, 1977 వరకుబీ నీలం సంజీవరెడ్డి జూలై 25, 1977నుండి జూలై 25, 1982 వరకుబీ జ్ఞాని జైల్ సింగ్ జూలై 25, 1982 నుండి జూలై 25, 1987 వరకుబీ ఆర్.వెంకటరామన్ జూలై 25, 1987 నుండి జూలై 25, 1992 వరకుబీ డా.శంకర దయాళ్ శర్మ–జూలై 25, 1992నుండి జూలై 25, 1997 వరకుబీ కె.ఆర్.నారాయణన్ జూలై 25, 1997నుండి జూలై 25, 2002 వరకుబీ డా.ఏ.పి.జె.అబ్దుల్ కలామ్ జూలై 25, 2002 నుండి జూలై 25, 2007 వరకుబీ ప్రతిభా పాటిల్ జూలై 25, 2007నుండి జూలై 25, 2012 వరకుబీ ప్రణబ్ ముఖర్జీ జూలై 25, 2012 నుండి 2015 నుండి 2017 వరకుబీ బీహార్ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్న రామ్‌నాథ్ కోవింద్ 14వ రాష్ట్రపతిగా ఎన్నికై జూలై 25, 2017 నుండి ఇప్పటి వరకూ కొనసాగుతున్నారు.

జులై 18న జరగబోయేది 16వ రాష్ట్రపతి ఎన్నిక అయినా.. ఎన్నిక కాబోయేది మాత్రం భారత 15వ రాష్ట్రపతి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తొలి, మలి రాష్ట్రపతిగా రెండు సార్లు



పదవిలో ఉన్నారు. ప్రస్తుతం రామ్నాథ్ కోవింద్ భారత 14వ రాష్ట్రపతిగా కొనసాగుతున్నారు.

ఇద్దరు రాష్ట్రపతులు... డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ పదవిలో ఉండగా మరణించారు. 2007 జూలై 25 న ప్రతిభా పాటిల్ ప్రమాణ స్వీకారం చేసి, మొట్టమొదటి సారి మహిళ రాష్ట్రపతిగా పదవిని అధిష్టించారు. 1969లో జూలై 20 నుండి ఆగష్టు 24 వరకు భారత దేశానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఇద్దరూ లేరు. రాష్ట్రపతి డా.జాకీర్ హుస్సేన్ మే 3 న మరణించగా, ఉపరాష్ట్ర పతిగా ఉన్న వి.వి.గిరి తాత్కాలిక బాధ్యతలు చేపట్టారు. అయితే రాష్ట్రపతిగా పోటీ చేయడానికై జూలై 20న వి.వి.గిరి రాజీనామా చేసిన క్రమంలో అత్యున్నత న్యాయస్థాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎం.హిదయతుల్లా తాత్కాలిక రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసారు.

1969లో రాష్ట్రపతి ఎన్నిక, చీలిక దిశగా సాగుతున్న కాంగ్రెసు పార్టీ అంతర్గత రాజకీయాల ఫలితంగా వివాదాస్పదమైంది. కాంగ్రెసు పార్టీ అధికారిక అభ్యర్థిగా పోటీ చేసిన నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ఆత్మ ప్రబోధానుసారం ఓటు వెయ్యమని ఇందిరా గాంధీ తన పార్టీ వారిని ఆదేశించారు. ఫలితంగా ప్రతిపక్ష మద్దతు కూడా గల వి.వి.గిరి, సంజీవరెడ్డిని ఓడించి రాష్ట్రపతి అయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ చీలిపోయింది.

రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక ఎంపి లేదా ఎమ్మెల్యే ప్రతిపాదించి మరో ఎంపి లేదా ఎమ్మెల్యే బలపరిస్తే సరి పోయేది. 1974 లో జరిగిన రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతిపా దించే వారి సంఖ్య, బలపరిచే వారి సంఖ్యను 10 కి పెంచారు. 1997 లో జరిగిన మరో సవరణ ప్రకారం ఈ సంఖ్యను 50 కి పెంచారు. రాష్ట్రపతి ఎన్నికల్లో నోటా (ఎవరికీ ఓటు వేయకపోవడం) అవకాశం లేదు. ఓటు వేసే వారు ఖచ్చితంగా ఎవరినో ఒకరిని ఎన్నుకోవాల్సిందే. ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలట్ ఉండదు. సాధారణంగా రాజకీయ పార్టీలు తమ సభ్యులు ఓటింగ్ లో పాల్గొనేటపుడు ఫలానా వారికే ఓటు వేయాలని విప్ జారీ చేస్తాయి. కానీ రాష్ట్రపతి ఎన్నికకు మాత్రం విప్ జారీ చేయరు. ఒకసారి రాష్ట్రపతిగా ఎన్నికైనా కూడా ఎన్ని సార్లయినా తిరిగి ఆ పదవికి పోటీ చేయవచ్చు.

పార్లమెంటు ఉభయ సభలకు ఎన్నికైన సభ్యులు, రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికైన సభ్యులు మరియు న్యూ ఢిల్లీ, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన శాసన సభలకు ఎన్నికైన సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కళాశాల ద్వారా రాష్ట్రపతిని పరోక్షంగా ఎన్నుకుంటారు. ప్రస్తుతం దేశంలో మొత్తం రాష్ట్రపతి ఎన్నిక ఓటర్ల సంఖ్య 4,809గా ఉంది. ఇందులో పార్లమెంట్ ఉభయ సభల సభ్యుల సంఖ్య 776 కాగా... దేశంలోని రాష్ట్రాలు, ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభ్యుల సంఖ్య 4,033గా ఉంది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

## పట్టణంలో జోరుగా అభివృద్ధి కార్యక్రమాలు

ఖమ్మం,జూన్15 : ప్రజల ఆశిస్సులతో పట్టణాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. పట్టణాల అభివృద్ధిని టిఆర్ఎస్ మాత్రమే చేయగలదని చెబుతున్నారు. అభివృద్ధికి అందరం చేయిచేయి కలుపుదామని పిలుపునిచ్చారు. పట్టణాన్ని సుందరీకరించడమే కర్తవ్యమన్నారు. అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని, మినీ స్టేడియం, మినీ ట్యాంక్‌బండ్, మోడల్ కూరగాయల మార్కెట్ రూపుదిద్దు కుంటున్నాయని అన్నారు. పట్టణప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి చేయాలన్న ఆకాంక్ష ఉందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల ముందుకు తీసుకొచ్చారన్నారు. పట్టణంలో మట్టిరోడ్లు లేకుండా చేస్తామన్నారు. పట్టణాభివృద్ధిలో ఏ మాత్రం వెనుకాడకుండా ముందుకు సాగుతున్నామని, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. పల్లె ప్రగతి కోసం చేపట్టిన ప్రగతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాలు బాగు పడాలంటే ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉందన్నారు. జిల్లా పేరును నిలబెట్టే ప్రయత్నం చేయాలన్నారు. అధికారులు సర్పంచులను సమన్వయం చేసుకుని పారిశుధ్యం, వైకుంఠధామాల నిర్మాణం తదితర కార్యక్రమాలు సాగుతాయని అన్నారు. చెట్లను పెంచినట్లయితే సకాలంలో వర్షాలు కురుస్తాయని, రైతుల భూముల్లో ఫాంపాండ్‌లు, ఇంకుడుగుంతలు తప్పని సరిగా నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేసిన 30రోజుల కార్యక్రమంలో గ్రామంలోని పారుశుధ్యం, నీటి సంరక్షణ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రతీ వర్షపు నీటి బొట్టు వృధాగా పోకుండా భూగర్భంలో ఇంకేలా ఒడిసిపట్టే బృహత్తర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంలో చేపట్టాలని పిలుపునిచ్చారు.భూగర్భంలో జలసంపద అడుగంటి పోవడానికి ప్రధాన కారణం అడవుల శాతం తగ్గిపోయి వర్షాలు సమృద్ధిగా కురియక పోవడం అన్నారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ వర్షం కురిసిన సమయంలో ప్రతీ చుక్కను కాపాడుకుంటే తప్ప భవిష్యత్ ఉండదన్నారు. నీటి సంరక్షణ పనులు చేపట్టాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అందుకే వరుణుడు కరుణించినప్పుడే ఒడిసిపట్టుకునే చర్యలను ప్రారంభించాలన్నారు. ఒకపక్క ఉన్న నీటిని కాపాడుకుంటూ మరొపక్క వర్షపునీరు వృధాగా పోకుండా సంరక్షించుకునే దిశగా గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని కోరారు. పంటలకు కోతుల వల్ల తీవ్రనష్టం వాటిల్లుతుందన్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కోతుల బెడద నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిం చాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే రైతులకు మరింత అండగా నిలిచేందుకు ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయం, అనుబంధంగా మరిన్ని పనులకు అనుసంధానం చేయాలని కోరారు. నీటిని వృథా చేయకుండా వేస్టేజీ వాటర్‌ను సైతం సద్వినియోగం చేసుకునేలా అధికారుల సూచనలు పాటించి రాబోయే తరాలకు కానుక ఇవ్వాలన్నారు. కరువు జిల్లా అని ఇక్కడి వారందరికి తెలుసు కరువును పారదోలడానికి విరివిగా చెట్లను నాటి, వాననీటిని ఒడిసిపట్టాలన్నారు.

# ప్రతిపక్షాల ట్రాప్‌లో పడకండి

- సమస్యలు సృష్టించే కుట్ర చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ
- గౌరవెల్లి నిర్వాసితులకు ఎకరానికి రూ.15 లక్షల పరిహారం
- ఇప్పటి వరకు 97.82 శాతం భూసేకరణ పూర్తి
- నిర్వాసితులతో చర్చించిన మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట,జూన్15:
రాష్ట్రంలో ఎక్కడా లేని విదంగా గౌరవెల్లి నిర్వాసితులకు ఎకరానికి రూ. 15 లక్షల పరిహారం ఇస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇప్పటి వరకు 97.82 శాతం భూసేకరణ జరిగిందని, రూ. 200 కోట్లు చెల్లించామని మంత్రి స్పష్టం చేశారు. నిర్వాసితులకు దండం పెట్టి చెబుతున్నా.. కాంగ్రెస్, బీజేపీ ట్రాప్‌లో పడకండి.. మీకు సమస్యలుంటే మీ తరుపున ప్రతినిధి బృందం వచ్చి అధికారులతో చర్చించండి. ప్రభుత్వం నిర్వాసితుల పట్ల సానుభూతితో ఆలోచిస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేటలోని పత్తి మార్కెట్ యార్డులో గౌరవెల్లి నిర్వాసితులతో హరీశ్‌రావు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

హుస్నాబాద్ ప్రాంత రైతులకు నీళ్లు రావొద్దనే లక్ష్యంగా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. నాడు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయం పనులు అడ్డుకొని, రైతులు పోలీసులపై తిరగబడేలా చేసి తప్పుకున్నారు. నేడు కూడా గౌరవెల్లి విషయంలో ప్రతిపక్షాలు అదే పని చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, రైతులు బాగుపడటం ఇష్టం లేకనే ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు యత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. కేసీఆర్ వల్లే లక్షలాది ఎకరాల్లో కోట్లాది క్వింటాళ్ల పంట పండిందని తెలిపారు. సాగునీటిని చూసి రైతుల కళ్లలో ఆనందభాష్పాలు వస్తుంటే.. ప్రతిపక్షాలకు మాత్రం కన్నీళ్లు వస్తున్నాయని విమర్శించారు. ఇరిగేషన్ అధికారులను అడ్డుకోవడం వల్లే.. వారి కోరిక మేరకు పోలీసుల భద్రత కల్పించామని తెలిపారు. అక్కడకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు వెళ్లి చేశారని పేర్కొన్నారు. గౌరవెల్లి నిర్వాసితులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడొద్దని సూచించారు. మీతో ఎన్నిసార్లు చర్చించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 2013 చట్టం ప్రకారం ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తామని హరీశ్‌రావు ఉద్ఘాటించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కోసం 3,816 ఎకరాల భూమి సేకరించామని తెలిపారు. ఇప్పటి వరకు 97.82 శాతం భూసేకరణ జరిగింది.. ఇంకా 2.1 శాతం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఈ 84 ఎకరాల నిర్వాసితులు పరిహారం తీసుకోలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద 693 నివాసాలు ముంపునకు గురయ్యాయి. 2015లోనే 683 ఇండ్లకు రూ. 83 కోట్ల పరిహారం చెల్లించాం? కేవలం 10 ఇండ్లకు మాత్రం చెల్లించలేదు. ఇందులో 5 ఇండ్లు రీ సర్వే చేయనున్నారు.. మిగతా ఐదిండ్లలో కుటుంబ తగాదాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కింద మొత్తం 937 కుటుంబాలను గుర్తించాము. ఇందులో 927 కుటుంబాలకు పరిహారం చెల్లించాము. మిగతా 10 కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయని పేర్కొన్నారు.

## కార్పోరేట్ ఫీజు దోపిడీని అరికట్టాలి

**బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా**

హైదరాబాద్,జూన్15: కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులను తగ్గించకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాష్ వెల్లడించారు. ఫీజుల నియంత్రణల లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. అధిక ఫీజులను వెంటనే



తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆ విద్యా సంస్థల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఉదయం బీజేవైఎం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈసందర్భంగా బీజేవైఎం జాతీయ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్య అనేది పేదలకు అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలన్నారు.

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మహబూబ్‌నగర్

**మంత్రి సమక్షంలో పలువురు టిఆర్ఎస్‌లో చేరిక**

మహబూబ్‌నగర్,జూన్15: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మహబూబ్‌నగర్‌ను చేసుకుందామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం మార్కెట్ యార్డులోని గుమస్తాలు, హమాలీలు మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని మంత్రి భరోసానిచ్చారు. మంచి చేసే వారి వెంబడి ఉంటే మంచి జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ 70 ఏండ్లు పాలించి కనీసం తగడానికి మంచి నీళ్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. టీఆర్ఎస్ పాలనలో సాగు, తాగు నీరుకు డోకాలేదన్నారు. కొన్ని పార్టీలు కుల, మత పిచ్చిలో జనం ఉండాలని కోరుకుంటున్నారు.

## ప్రజలను బోల్తా కొట్టించడంలో కేసీఆర్ నిష్ణాతుడు

### ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కెసిఆర్ ఇంటికే

### దేశంలో సంక్షేమ పాలన అందిస్తున్న మోడీ

### మోడీ ఎనిమదేళ్ల పాలనపై సభలో ఈటెల రాజేందర్

మెదక్,జూన్15: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీఆర్ఎస్ ఇంటికి పోవడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మోడీ పాలన ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎనిమిదేళ్ల పాలనలో ఎన్నో గొప్ప సంక్షేమ పథకాలను మోడీ ప్రవేశపెట్టారని కొనియాడారు. కాంగ్రెస్ హయాంలో ఎక్కడపడితే అక్కడ కుంభకోణాలు జరిగాయని, మోడీ పాలనలో కనీసం ఒక్క కుంభకోణమైనా జరిగిందా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో దేశాన్ని మోడీ కాపాడిన తీరు ప్రతి ఒక్కరికి గుర్తుండిపోతుందన్నారు. ప్రజలను బోల్తా కొట్టించడంలో కేసీఆర్ నిష్ణాతుడని, ఆయన మాటలకు.. చేతలకు ఎలాంటి పొంతన ఉండదని ఈటల అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం అప్పుల పాలయిందని, రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపై రూ.1.25 లక్షల అప్పు భారం మోపారని మండిపడ్డారు. ఇష్టమొచ్చినట్లుగా ధరలు పెంచుతూ పేదల నడ్డి విరుస్తున్నారని ధ్వజమెత్తారు. మద్యంపై వచ్చే ఆదాయంతోనే రాష్ట్ర సర్కారు నడుస్తోందని, రాష్ట్రాన్ని తాగుడుకు బానిస చేశారని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్ని ÷ర్ అయ్యారు. కేసీఆర్ ను సీఎం చేసిన పాపానికి ప్రజలు అనుభవిస్తున్నారని, అందుకే ఆయనంటే ప్రజలకు అసహ్యం కలుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని అర్థమైనందునే కేసీఆర్ బీహార్ కు వెళ్లి రూ.600 కోట్ల కాంట్రాక్ట్ తో పీకేను తీసుకొచ్చుకున్నారని చెప్పారు. గోల్ మాల్ విద్యతో ప్రజలను దోపిడీ చేసేందుకు పీకే లాంటి వారు పనికొస్తారే తప్ప... బాగు చేయడానికి కాదని స్పష్టం చేశారు. ఎంతమంది పీకేలు వచ్చినా కేసీఆర్ ఓటమిని ఆపలేరని... డబ్బు, సారా సీసాలకు రాష్ట్రంలో స్థానం లేదని చెప్పారు. కేసీఆర్ కు ఓటేయకపోతే సంక్షేమ పథకాలు ఆపేస్తామని టీఆర్ఎస్ నాయకులు బెదిరిస్తున్నారన్న ఆయన... కేసీఆర్ అవినీతిని ప్రశ్నించిన వాళ్లపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కు విశ్వసనీయత లేదని, కష్టపడితే బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



## దేశానికి ప్రత్యామ్నాయా ఎజెండా కెసిఆర్‌తోనే సాధ్యం

### అందుకే ప్రజలు కెసిఆర్ వైపు చూస్తున్నారు

### తెలంగాణ అభివృద్ధి తరహాలో దేశాభివృద్ది సాధ్యం

### మంత్రి జగదీశ్వర్ రెడ్డి వెల్లడి

సూర్యాపేట,జూన్15: ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశానికి కావాల్సింది ప్రత్యామ్నాయ పార్టీలో, ప్రభుత్వాలో కాదని.. ప్రత్యామ్నాయ ఎజెండా అవసరమని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. అందుకోసం యావత్ భారతదేశం ఎదురు చూస్తుందని ఆయన తెలిపారు. సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు దేశ అవసరాల కోసం ఏ రాజకీయ పార్టీ కూడా సరైన పునాదులు నిర్మించలేక పోయిందన్నారు. స్వతంత్ర పోరాటం అనంతరం అధికారంలోకి



వచ్చిన కాంగ్రెస్ పార్టీ గానీ, ఆ తరువాత తామే ప్రత్యామ్నాయం అంటూ ఏర్పడ్డ రాజకీయ పార్టీల సమూహాలు కానీ, ఆ తరువాత కాలంలో గుజరాత్‌ను చూపించి దేశాన్ని ఉద్ధరిస్తామంటూ అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ వరుసగా వైఫల్యం చెందాయని ఆయన విమర్శించారు. దేశాభివృద్ధిలో జాతీయ పార్టీలు విఫలం అయినందునే సీఎం కేసీఆర్ కొత్త పార్టీ ఆలోచన చేస్తున్నారని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్.. భారత రాష్ట్ర సమితి పార్టీగా మారే అంశంపై స్పందించిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు దేశ భవిష్యత్తుకు సరైన పునాదులు వేయలేకపోయాయని, సహజవనరులు ఉన్నా ఉపయోగించుకోలేని దుస్థితికి దేశాన్ని తీసుకొచ్చాయని విమర్శించారు. బీజేపీ పాలన దేశాన్ని మధ్యరాతి యుగం వైపు తీసుకెళ్తుండగా ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ విఫలమైందన్నారు. దేశంలో రోజురోజుకి పరిస్థితి దిగజారుతున్న నేపథ్యంలో దేశాభివృద్ధికి ప్రత్యామ్నాయ అజెండా కావాలన్నారు. ప్రత్యామ్నాయ అజెండా తీసుకొచ్చే శక్తుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, కొత్త తరానికి కొత్త ఎజెండాతో కేసీఆర్ రాబోతున్నారని అన్నారు. ఎనిమిదేళ్ళలో తెలంగాణా రూపురేఖల్ని మార్చినట్లుగానే కొత్త తరానికి కొత్త అజెండాతో కేసీఆర్ రాబోతున్నారన్నారు. త్వరలోనే దేశ రూపురేఖల్ని మార్చే అజెండా కేసీఆర్ ప్రకటిస్తారని అన్నారు. కేసీఆర్ ఎజెండా నచ్చితే ప్రజలు ఆశీర్వదిస్తారని, ఎవరిని ఎక్కడ కూర్చోబెట్టాలో ప్రజలే నిర్ణయిస్తారని మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ పార్టీలు ఏవీ కుడా ప్రజల ఆకలి, మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించలేకపోయాయని పేర్కొన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి లబ్ది పొందాలని బీజేపీ చూస్తోంది. అయితే ప్రతిపక్ష పాత్రను కూడా సరిగా నిర్వహించలేని హీనదుస్థితికి కాంగ్రెస్ పార్టీ చేరుకుందన్నారు. అటువంటి పరిస్థితులనుండి బయట పడేందుకే దేశం ప్రత్యామ్నాయ పార్టీ కోసమో, ప్రభుత్వం కోసమో కాకుండా ప్రత్యామ్నాయ ఎజెండా కోసం ఎదురు చూస్తుందని ఆయన తెలిపారు. అటువంటి ఎజెండా, ఆవశ్యకతను వెల్లడించినందునే ప్రస్తుతం యావత్ భారతదేశం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను స్వాగతిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు.

తెలంగాణా రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా కేవలం ఎనిమిది సంవత్సరాల కాలంలోనే ప్రపంచ చిత్ర పటంలో తెలంగాణాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిన మహానేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన కొనియాడారు. అటువంటి నేత తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణా రూపురేఖలు మారిపోయాయన్నారు. ఎటువంటి కొలమానాన్ని పెట్టి చూసినా ఒకటి నుండి 50 వరకు దేశంలో తెలంగాణాయే నెంబర్ వన్ స్థానంలో కనిపిస్తుందని, అందుకే ప్రస్తుతం యావత్ భారతదేశం ముఖ్యమంత్రి కేసీఆర్ వైపు చూస్తుందన్నారు. దేశానికి కావల్సిన ప్రత్యామ్నాయ ఎజెండా ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎప్పుడూ చరిత్ర నిర్మాతలేనని ఆయన అన్నారు. అటువంటి ప్రజల అభీష్టానికి అనువైన ఎజెండాను ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే ప్రకటిస్తారని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

**కల్నల్ సంతోష్‌బాబు చిరస్మరణీయుడు**
**రెండో వర్ధంతి సందర్భంగా ఘనంగా మంత్రి నివాళి**

దేశ కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు చరిత్రలోనే చిరస్మరణీయుడిగా నిలిచి పోతారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. భారత్–చైనా సరిహద్దుల్లో జరిగిన యుద్ధంలో అసువులు బాసిన మహావీరచక్ర దివంగత కల్నల్ సంతోష్ బాబు రెండో వర్ధంతి సందర్భంగా సంతోష్ బాబు చిత్రపటానికి మంత్రి ఘన నివాలులర్పించారు. కాసరబాద్ రోడ్డులోని స్మృతి వనంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సంతోష్ బాబు విగ్రహాన్ని మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంతోష్ బాబు మరణానంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సహాయ సందేశం ఇతర రాష్ట్రాలతో పాటు యావత్ భారతదేశానికి స్ఫూర్తివంతమైన సందేశాన్ని చేరవేసిందన్నారు. ఆర్మీలో పనిచేసే ప్రతి ఒక్కరికి రేపటి రోజున వారి కుటుంబాలకు భారత ప్రజలు అండగా ఉంటారు అనేది ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సహాయానికి సందేశం అని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సంతోష్ కుమర్ భార్య సంతోషి, కుటుంభ సభ్యులతో పాటు మున్సిపల్ చైర్మన్ పెరుమాళ అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉప్పల లలిత, జడ్పీటీసీ జీడి భిక్షం, రాష్ట్ర టీఆర్ఎస్ కార్యదర్శి వై.వీ, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ, తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు ఎత్తిపోతలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం

**ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**
**సుమన్ ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తున్నారన్న మంత్రి వేముల**

మంచిర్యాల,జూన్15: చెన్నూరు ఎత్తిపోతల పథకం పూర్తయితే ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు, బాల్క సుమన్ పేరు చెన్నూరు నియోజకవర్గ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తితోనే చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. గొప్ప కార్యదీక్ష గల నాయకుడు సుమన్ అని ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా చెన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుమన్‌తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ..ఎమ్మెల్యే సుమన్ ప్రజలకు ఇచ్చిన మాట కోసం బాధ్యతగా పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గానికి రానన్ని నిధులు చెన్నూర్ నియోజకవర్గానికి వచ్చాయన్నారు. చెన్నూరు ఎత్తిపోతల పథకానికి రూ.1658 కోట్ల నిధులు తీసుకొచ్చిన మహా ఘనుడు బాల్క సుమన్ అని ప్రశంసించారు. తెలంగాణలో



అమలవుతునన సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కా లేవన్నారు. రాష్ట్రానికి ఒక్కపైసా తీసుకురాని ప్రతిపక్షాలవి అర్థం లేని వాదనలని కొట్టిపారేశారు.
వేరే రాష్ట్రంలోని బీజేపీ, కాంగ్రెస్ నేతలే తెలంగాణ సంక్షేమ పథకాలను మెచ్చుకుంటున్నాయి. అబద్దాల తో పబ్బం గడుపుకోవాలనుకునే నాయకుల మోస పూరిత మాటలు ప్రజలు నమ్మొద్దన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకులని ప్రజలు కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సుమన్ మాట్లాడుతూ.. చెన్నూరు నియోజకవర్గ చరిత్రలో నేడు నిలిచిపోయే సుదినం అన్నారు. ముఖ్యంగా కోటపల్లి మండల ప్రజల చిరకాల స్వప్నం తుంతుంగ వాగుపై 8 కోట్ల రూపాయలతో నిర్మించిన బ్రిడ్జి శంకుస్థాపన చేసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి రావడం వల్ల కోటపల్లి మండలంలోని ఏదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యల పల్లి, ఆల్గామా, జనగామ, వెంచపల్లి గ్రామాల దశాబ్దాల కష్టాలు తొలగిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా చర్చ పెట్టాలన్నారు.

## జగిత్యాల లో మట్కా స్థావరాలపై సిఎసెస్ పోలీసులు దాడి

### లక్ష రూపాయలు,7 మొబైల్ ఫోన్లు స్వాదినం

### అదుపులో 7 గురు నిందితులు

జగిత్యాల జూన్ 15 (ప్రజా మంటలు) : మహారాష్ట్ర కేంద్రంగా జిల్లాలో జరుగుతున్న మట్కా స్థావరాలపై సిఎసెస్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి, 7 గురు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని, ఇందులో 1,01,000/–





రూపాయలును,7 మొబైల్ ఫోన్లను సీజ్ చేయడం జరిగిందని సిఎసెస్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మట్కా ఆడుతూ పట్టుబడ్డ వారి వివరాలు షేక్ బషీర్, మహారాష్ట్ర,కు చెందిన వ్యక్తిగా, మిగతావారు చిలువెరి వెంకటేష్, నవ్వాజ్ సురేష్, నవ్వాల్ కిషోర్, అమ్రగ్గుదా సత్యం, అదిముల్ల వీరేశం, ఐలవెని సతీష్ లు జగిత్యాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.
ఈ సందర్భంగా సిఎసెస్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్ర కేంద్రంగా జిల్లా లో మట్కా నిర్వహిస్తున్న ముఠాను జిల్లా ఎస్పీ శ్రీమతి సింధు శర్మ ఆదేశాల మేరకు ఈరోజు అరెస్టు చేయడం జరిగిందని అన్నారు. దినసరి కూలీలు, సామాన్య ప్రజలే లక్ష్యంగా ఈ యొక్క మట్కా స్థావరాలు నిర్వహించడం జరుగుతుందని ఒకటికి వంద రేట్లు లాభం ఉంటుందని ఆశ చూపిస్తూ వాట్సాప్ ద్వారా ఈ మట్కా ను నిర్వహిస్తున్నట్లు గుర్తించామని మరియు ఫోన్ పే, గూగుల్ పే వంటి ద్వారా మనీ ట్రాన్సాక్షన్ చేయడం జరుగుతుందని గుర్తించడం జరిగిందని తెలిపారు.
చట్టవ్యతిరేక కార్యకలాపాలు కు సంబదించి ఎలాంటి సమాచారం ఉన్న సంబదిత పోలీస్ లకు గాని లేదా సిసిఎస్ ఇన్స్పెక్టర్ కిరణ్ 9440795588 కు సమాచారం ఇవ్వాలని, స్మాచారమ్ ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడతాయని అన్నారు. ఈ దాడిలో ఆర్ ఎసై కృష్ణ గౌడ్, సిసిఎస్ ఎస్.ఐ రవీందర్, టౌన్ ఎస్.ఐ సంజీవ్ మరియు కానిస్టేబుల్ లు కిరణ్, కుమార్, రమేష్ పాల్గొన్నారు.



## రైతుల విద్యుత్ కనెక్షన్ల కొరకు తెరాస జెడ్‌పిటిసి ఆమరణ దీక్ష

జగిత్యాల జూన్ 15 (ప్రజా మంటలు) : వరద కాలువ వెంట సాగులో ఉన్న భూములలో ఉన్న విద్యుత్ మోటార్ లకు కనెక్షన్ లు ఇవ్వాలని కోరుతూ అధికార పార్టీకి బీచెందిన కథలాపూర్ జెడ్పిటిసి నాగం భూమయ్య ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా విద్యుత్ ప్రగతి భవన్, ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆమరణ దీక్ష చేపట్టారు. గతంలో ఈయన తెలంగ్న ను ప్రత్యేక దేశంగా చేయాలనే డిమాండ్ కూడా చేసి, ప్రాచుర్యం పొందారు. ఈ సందర్బంగా భూమయ్య మాట్లాడుతూ జిల్లాలోని వరద కాలువ వెంట ఉన్న రైతులకు కరెంట్ కనెక్షన్ లు ఇవ్వడం లేదని భూమయ్య, ఆరోపించారు. తమ భూములు పట్టా భూములని, సుమారు 5వేల కనెక్షన్ లు ఉన్నాయని అన్నారు. జెడీపీ సమావేశం లో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకెళ్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన విద్యుత్ ఎస్.ఈ, ఆ తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. వెనువెంటనే వరద కాలువ వెంట ఉన్న మోటార్ లకు విద్యుత్ కనెక్షన్ లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈయన తో పాటు కొంత మంది రైతులు కూడా దీక్షలో కూర్చున్నారు.

## పాలేరు నుంచి షర్మిల పోటీ

**19న నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం**
**నియోజకవర్గ ఇన్‌చార్జి బీరవెల్లి శ్రీనివాసరెడ్డి**

ఖమ్మం,జూన్15:వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు షర్మిల వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగబోతున్నారని పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి బీరవెల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు నుంచి షర్మిల పోటీ చేస్తున్నందున ఈనెల 19న నేలకొండపల్లిలో పాలేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా పాలేరు



నియోజకవర్గం ఆది నుంచి కాంగ్రెస్‌కు పట్టున్న స్థానం. ఇక్కడ రెడ్డి సామాజికవర్గం నాయకులదే ఆధిపత్యం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కందాళ ఉపేందర్ రెడ్డి గెలుపొందారు. గిరిజన ఓటు బ్యాంకు అధికంగా ఉండడం.. ఆయా గ్రామ రాజకీయాలు రెడ్డి సామాజికవర్గం నేతల చేతిలో ఉండడం, తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండడం, రాంరెడ్డి వెంకటరెడ్డి మరణానంతరం కాంగ్రెస్‌కు బలమైన నాయకుడు లేకపోవడం లాంటి అంశాలు తమకు కలిసొస్తాయన్న ఉద్దేశంతో షర్మిల పాలేరు నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు టీఆర్ఎస్‌లోని వర్గ విభేదాలు కూడా తమకు లాభిస్తాయని షర్మిల పార్టీ భావిస్తోంది.

## కర్నాటకలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

**బెంగళూరులో 31 మంది విద్యార్థులు పాజిటివ్**

బెంగళూరు,జూన్15: కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తున్నది. ఇటీవల దేశంలో పాజిటివ్ కేసులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదిలా ఉండగా.. బెంగళూరులో 24 గంటల్లో 31 మంది విద్యార్థులు కరోనా పాజిటివ్‌గా తేలింది. న్యూ స్టాండర్డ్ పాఠశాలలో చదువుతున్న 21 మంది విద్యార్థులు, ఎంఈఎస్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్దారణ అయ్యింది. విద్యార్థులకు వాక్సిన్ వేసే సమయంలో కొవిడ్ పరీక్షలు నిర్వహించగా.. పాజిటివ్‌గా తేలింది. విద్యార్థులు వైరస్ బారినపడడంతో రెండు పాఠశాలలను శానిటైజ్ చేశారు. బెంగళూరులో కొవిడ్ –19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కర్ణాటక ఆరోగ్య శాఖ పాఠశాలలు, కళాశాలలను ఆదేశించింది. బృహత్ బెంగళూరు మహానగర పాలికే (ఃఃఓఖ) సైతం ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రోటోకాల్స్‌ను పాటించాలని ఆదేశించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులకు, సిబ్బందికి తప్పనిసరిగా థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని, లక్షణాలుంటే వారికి కొవిడ్ పరీక్షలు చేయించాలని చెప్పింది. సిబ్బందికి రెండు డోసుల టీకాతో పాటు బూస్టర్ డోస్ వేశారా? లేదా స్పష్టంగా తెలుసుకోవాలని ఆదేశించింది.

## కన్నుల పండుగగా ఎల్లమ్మ జాతర
### - పాల్గొన్న ఎమ్మెల్యే సతీష్ కుమార్

**భీమదేవరపల్లి జూన్ 15 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఎల్లమ్మ జాతర కన్నుల పండుగగా సాగింది. బుధవారం జాతర కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. హుస్నాబాద్ నియోజక వర్గం



శాసన సభ్యులు సతీష్ కుమార్ దర్శించుకొని చల్లంగా చూడు ఎల్లమ్మ తల్లీ అంటూ ఆనంద పరవశంలో, భక్తుల కేరింతలతో తన్మయం పొందారు. భక్తుల జయ జయ ధ్వనాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి వంగ రవి, ఎంపిపి జక్కుల అనితా రమేష్ యాదవ్, మాజీ ఎంపిపి సంగ సంపత్, బొడిగె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతిలో భాగంగా ప్రజలు భాగస్వామ్యులు కావాలి

**జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):** 4వ విడత పట్టణ ప్రగతిలో భాగంగా 26, 27, 11వ వార్డ్ లలో మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మన జగిత్యాల పట్టణం అభివృద్ధిలో ఎంతో ముందంజలో




ఉన్నామని షాధిఖానా లు, పార్కులు, డివైడర్లు, కమ్యూనిటీ హాల్స్, స్మశాన వాటికలు ఇలా ఇంకెన్నో నిర్మాణాలు చేసి అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నాం అని తెలిపారు. మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణిప్రవీణ్ మాట్లాడుతూ.... అసలు పట్టణప్రగతి అంటే ప్రతి రోజు వార్డ్స్ తిరుగుతూ ఉంటే ప్రజల ద్వారా వార్డ్స్ లోని సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటది కావున తద్వారా దానిని పరిష్కరించే దిశగా మనకు పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని అందించడం జరిగినది. అలాగే అన్ని వార్డ్స్ లలో అభివృద్ధి పనులు చేపడుతున్నమని గతంలో కంటే అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కావున ప్రజలు అందరు పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్స్ బాలే లత శంకర్, అస్మా అంజూమ్, మొహమ్మద్ రాజియొద్దీన్, వైస్ చెర్మెన్, కమిషనర్ స్వరూపరాణి, డిఈ, ఏఈ, ఎస్ఐ, కౌన్సిలర్స్, నాయకులు, వాడ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మంత్రి హరీష్ రావును కలిసిన భూ నిర్వాసితులు

**హుస్నాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం మెట్టుబండల వద్ద ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుని కలిసిన గౌరవెల్లి భూ నిర్వసితులు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నాయకులు కోదండ రెడ్డి. భూ



నిర్వాసితులను, కాంగ్రెస్ పార్టీ నాయకులను సాదరంగా ఆహ్వానించిన మంత్రి హరీశ్ రావు. భూ నిర్వాసితులతో కాంగ్రెస్ పార్టీ నాయకులతో గంటకు పైగా కొనసాగిన చర్చలు జరిగాయి. నిర్వాసితుల డిమాండ్ల పట్ల సానుకూలంగా మంత్రి హరీశ్ రావు స్పందించారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ.... గౌరవెల్లి ప్రాజెక్ట్ ఒక కళ అని, భూ నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూసుకుంటానని, అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తానని చెప్పారు. భూ నిర్వాసితులు, మంత్రికి మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో ఇక గౌరవెల్లి ప్రాజెక్ట్ ట్రయల్ రన్ కు మార్గం సుగమం అయినట్టుగా తెలుస్తుంది. భూ నిర్వాసితులకు, కాంగ్రెస్ నాయకులకు భోజనం పెట్టి పంపించిన మంత్రి హరీష్ రావు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరు వెంకట్, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి భూ నిర్వాసితులపై జరిగిన లాఠీఛార్జ్
### తెలియగానే హుటాహుటిన బయల్దేరిన బిజెపి చీఫ్ బండి సంజయ్ : బాధితులకు పరామర్శ

**హుస్నాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా గుడాటిపల్లిలో పోలీసులు, టీఆర్ఎస్ నాయకుల దాడిలో గాయపడ్డ గౌరవెల్లి బాధితులను పరామర్శించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్. 14



ఏళ్లుగా ఏనాడు ప్రాజెక్టును అడ్డుకోలేదు, ప్రాజెక్టు కోసం తమ భూములను ఇచ్చేసామని, పరిహారం ఇవ్వడం లేదని, 14 ఏళ్లుగా పరిహారం అందించాలని కోర్టు చెప్పిన కూడా ప్రభుత్వం కక్షకట్టినట్టుగా వ్యవహరిస్తోందని నిర్వాసితులు వాపోయారు. పరిహారం కోసం వెళితే అధికారులు, అసభ్య పదజాలంతో వేధిస్తున్నారని, పోలీసులు ఇష్టమొచ్చినట్లుగా విచక్షణారహితంగా తమపై దాడి చేసారని, మేం చేసిన తప్పేందేని వారు వాపోయారు.

స్థానిక టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆదేశాలతోనే పోలీసులు, టీఆర్ఎస్ నాయకులు తమపై దాడులు చేస్తూ వేధిస్తున్నారని భూనిర్వాసితులు తమ సమస్యలు సంజయ్ తో చెప్పుకున్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ కు అధికారం తలకెక్కి కాండకావరంతో వ్యవహరిస్తున్నాడు. కమీషన్లకు అలవాటు పడి బలుపెక్కి పోలీసులతో ఇష్టమొచ్చినట్లు కొట్టిస్తున్నాడు. ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేశారు. పరిహారం అడిగితే చావబాదుతారా...? అని అన్నారు. బాధితులేమైనా సీఎం ఫామ్ హౌస్‌లో జాగా అడిగారా? దేశమంతా కోట్ల రూపా



యలతో యాడ్స్ ఇస్తూ పబ్లిసిటీ చేసుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ డబ్బుతో ఇక్కడున్న వాళ్ళందరికీ పరిహారం అందించొచ్చు కదా..! నిజాం కాలం నాటి అరాచకాలు కెసిఆర్ పాలనలో కొనసాగుతోంది. కడుపుకాలి బాధితులు ఉంటే బలుపెక్కి కెసిఆర్ రెచ్చగొట్టి, పోలీసులతో కొట్టిస్తున్నాడు. పంజాబ్ కు పోయి అక్కడోళ్లకు 3 లక్షలు ఇస్తున్నాడు. ఇక్కడి రైతులు చస్తుంటే, పైసా సాయం చేయకుండా పోలీసులతో కొట్టిస్తున్నాడన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బిజెపి పోరాడుతుందని, పోలీసుల దాడిలో గాయపడ్డ బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వారిని తీసుకెళ్లి గవర్నర్ కు, మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేస్తాం. బిజెపి లీగల్ టీమ్ గౌరవెల్లి ని సందర్శించి బాధితులతో కలిసి న్యాయ పోరాటం చేస్తుందని తెలిపారు.

## మంత్రి ఆదేశాలతోనే నిర్వాసితులపై లాఠిచార్జ్
### కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి లోని భూ నిర్వాసితుల దీక్షా శిబిరాన్ని సందర్శించి పోలీసుల దాడిలో గాయపడిన భూ నిర్వాసితులను పరామర్శించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్. గౌరవెల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.... టిఆర్ఎస్ కు చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో ఈ సమస్యను పరిష్కరించి ఉండేవారని అన్నారు. ఈ ప్రాజెక్టు పై కోర్టులో కేసులు నడుస్తుండగా పనులు చేస్తూ భూ నిర్వాసితుల పై లాఠీచార్జీలు చేయడం చాలా దౌర్భాగ్యమైన చర్య అని విమర్శించారు. దీనికి బాధ్యులైన ఈ ఈ రాములు నాయక్ ,సి ఐ రఘుపతి రెడ్డి ని విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ నువ్వు మా సమస్యను పరిష్కరిస్తామని మహారాజా కుర్చీలు



గుడాటి పల్లి భూ నిర్వాసితుల దీక్షా శిబిరం వద్దకు వచ్చి మంత్రి హరీష్ రావు మాట్లాడాలని అన్నారు. లేకపోతే భూ నిర్వాసితులను తీసుకొని సిద్దిపేటలోని హరీష్ రావు ఇంటికి తీసుకు వెళ్దామని అన్నారు. నిర్వాసితుల నుండి మంత్రి హరీష్ రావుకు ఏ హాని జరగకుండా మా కార్యకర్తలు రక్షణ కవచంగా ఉంటారని అన్నారు. టిఆర్ఎస్ నాయకులు నిర్వాసితులను రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేశారని, హైకోర్టు స్టే విధించగా ట్రయల్ రన్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. రాజకీయ లబ్ది కోసమే బలి పశువులను చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ఎస్యుఐ రాష్ట్ర అధ్యక్షులు తెచ్చాము. పాలాభిషేకాలు చేస్తాము. ప్రాజెక్టు వద్దకు రండి అని అన్నారు. దేశమంతా కోడై కూస్తుంటే గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులపై లాఠీచార్జి బలప్రయోగం జరగలేదని సిపి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐపీఎస్ చదివిన ఆమె విజ్ఞత ఇదేనా? అని ప్రశ్నించారు. ఐపీఎస్ ను అగౌరవపరిచే విధంగా సీపీ శ్వేత మాట్లాడుతున్నారని అన్నారు. సిపి శ్వేత, హరీష్ రావు చెప్పినట్లు నడుచుకుంటూ ఉందని అన్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యేంతవరకూ కాంగ్రెస్ పార్టీ భూ నిర్వాసితులకు అండగా ఉంటుందని అన్నారు. వారు అధైర్య పడవలసిన అవసరం లేదన్నారు.

## కళ్యాణలక్ష్మి, సిఎంఆర్ చెక్కుల పంపిణీ
### పల్లె ప్రకృతి, వైకుంటధామం, కంపోస్ట్ షెడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

**రాయికల్ జూన్ 15 (ప్రజామంటలు):** రాయికల్ మండలం లోని అల్లీపూర్, కుర్మపల్లి, ఉప్పుమడుగు, రాజ్ నగర్, అలియా నాయక్ తాండా, వస్తాపూర్, ఒడ్డె లింగాపూర్, చింతలూరు, మంత్యా నాయక్ తాండా, వడ్డెర కాలని, మూటపల్లి, రామోజీ పేట్, మహితా పూర్ గ్రామాల్లో పల్లె



ప్రకృతి, వైకుంటధామం, కంపోస్ట్ షెడ్లను ప్రారంభించి గ్రామానికి చెందిన నర్సరీ లను పరిశీలించి, అనంతరం గ్రామాలకు చెందిన 61 మంది లబ్దిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా 23 లక్షల 18 వేల రూపాయల విలువగల చెక్కులను, 29 మంది ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన 29 లక్షల 3 వేల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, ఏఎంసి ఛైర్మెన్ రాజీ రెడ్డి, పిఏసిఎస్ఏ ఛైర్మెన్ లు రాజ లింగం, ఏనుగు మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షులు కొల శ్రీనివాస్, ప్రధాన



కార్యదర్శి తలారి రాజేష్, మండల కో ఆప్షన్ ముఖీధ్, వార్డు సభ్యులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,మహేష్, రైతు బందు మండల కన్వీనర్ మోహన్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు బాపు రావు, సర్పంచుల ఫోరం శ్రీనివాస్, ఉప సర్పంచ్ ల ఫోరం వెంకటేష్, యూత్ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ఎంపిడివో సంతోష్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పిఏసిఎస్, ఏఎంసి వైస్ చైర్మన్ లు, డైరెక్టర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి భూనిర్వాసితుల ఉసురు తాకి టీఆర్ఎస్ ప్రభుత్వం కుప్పకూలుతుంది

**ప్రాజెక్టుకు భూమిని ఇచ్చిన భూదాతలపై లాఠీచార్జి చేయడం సిగ్గు చేటు**

**గాయాలపాలైన భూనిర్వాసితులకు బీజేపీ వైద్య ఆరోగ్య బృందం హెల్త్ చెకప్, మందుల పంపిణీ**

**భూనిర్వాసితులకు భరోసా, పరామర్శ...**

**హుస్నాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించకుండా ట్రయల్ రన్ చేస్తామని చెప్పడంతో భూనిర్వాసితులు పరిహారం చెల్లించన తరువాత ట్రయల్ రన్ చేయాలని, అడ్డుకోవడంతో టీఆర్ఎస్ నాయకులు, పోలీసులు భూనిర్వాసితులపై లాఠీచార్జి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి గాయాలైన నిర్వాసితులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పరామర్శించి, వైద్యులు పంపించి, చికిత్స చేయిస్తానని హామీ ఇవ్వడంతో బుధవారం బీజేపీ రాష్ట్ర వైద్య ఆరోగ్య



శాఖ బృందం డాక్టర్లు రామిరెడ్డి, రామకృష్ణ, సుభాష్, దీపక్ గౌరవెల్లి ప్రాజెక్టు వద్దకు వచ్చి గాయాలైన నిర్వాసితులకు చికిత్స చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు అండగా భారతీయ జనతా పార్టీ ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఫిలీం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, అక్కన్నపేట మండల అధ్యక్షులు గోళ్లపల్లి వీరాచారి, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, మండల అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్ రెడ్డి, బీజేవైయం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, హుస్నాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి తోట సమ్మయ్య, చిగురుమామిడి మండల ప్రధాన కార్యదర్శి పైడిపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఒగ్గోజు వెంకటేశ్వర్లు, పచ్చిమట్ల శ్రీధర్, జగన్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.




## బాసర ట్రిపుల్ ఐ.టి. విద్యార్థుల సమస్యలు పరిష్కారించండి

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐ.టి. లో తమ సమస్యలను పరిష్కారం చేయాలని ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం ట్రిపుల్ ఐ.టి. లను నిర్లక్ష్యం చేస్తుందని, గతంలో కూడా విద్యార్థులు మెస్ సరిగ్గా నడపాలని, విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఫ్యాకల్టీ ఏర్పాటు చేయాలని, వి.సి. క్యాంపస్లో ఉండాలని, హాస్టల్స్ రెనోవేషన్ చేయాలని, లైబ్రరీలో టెక్నికల్ విద్యార్థులకు అదనపు బుక్స్ ఏర్పాటు చేయాలని, మెస్ టెండర్లను మార్చాలని, పి.డి., పి.ఇ.టి. లను నియమించాలని, కంప్యూటర్ ల్యాబ్స్ పెంచాలని, కెసిఆర్ వారి క్యాంపస్ విజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తరుణ్ నాయక్, నాయకులు అంజలి, యకాన్న, ప్రియాంక, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి వైయస్సార్ టిపి ఆర్థిక సహాయం

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రానికి చెందిన సాయబోయిన జహంగీర్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని వారికి వైఎస్సార్ తెలంగాణ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ మృతుని కుటుంబానికి



వైయస్సార్ టిపి జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ చేవెళ్ల స్వామి ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. వైఎస్సార్ టి.పి జనగామ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య హాజరై మాట్లాడుతూ.... జనగామ జిల్లాలోని పేద ప్రజలకు షర్మిలక్క వైఎస్సార్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మున్ముందు కూడా వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేదవారికి ఆపదలో ఆదుకునేది కేవలం వైఎస్సార్ టి.పి పార్టీ మాత్రమేనని రాబోయే రోజుల్లో మరింత మంది పేద వారికి సహాయం చేయడంలో పార్టీ ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు. ఆర్థిక సహాయం అందించిన పార్టీ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మానెగళ్ళ మంజుల, పట్టణ అధ్యక్షురాలు చోప్పాల వసంత, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు శ్రీకాంత్, సుభద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణ ప్రగతి పర్యటనలో కూరగాయల మార్కెట్ రెడ్డి స్ట్రీట్ లో దోజర్ తో శుభ్రం చేశారు. పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, 27 వార్డు ప్రత్యేక అధికారి జితేందర్ రెడ్డి మున్సిపల్ అధికారి మంద లక్ష్మి, లైన్ మెన్ ఏల ప్రదీప్, ఆర్. పి. నాగమణి, జైన రమేష్, వీరచారి, చిరంజీవులు, భాస్కర్, రాజు, మురళి, సోమేశ్వర్.



తరిగొప్పుల మండలం ఎన్యనాయక్ తండా కూడలిలో ఏర్పాటు చేసిన వీధి దీపాల స్తంభం. వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందికరంగా మారిందని ప్రజల అసంతృప్తి.

## పల్లె ప్రగతి దేశానికే ఆదర్శం
### - జడ్పీ చైర్పర్సన్ దావ వసంత

**జగిత్యాల ప్రతినిధి జూన్ 15 (ప్రజామంటలు):** అద్భుతమైన ఫలితాలిస్తున్న పల్లెప్రగతి కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలిచిందని జగిత్యాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. బుధవారం కొడిమ్యాల మండలంలోని తుర్కాశీనగర్ గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించి అనంతరం నమిలికొండ, నల్లగొండ గ్రామాల్లో 5వ విడత పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, జడ్పీ చైర్పర్సన్ వసంత ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్పర్సన్ వసంత, చొప్పదండి ఎమ్మెల్యే రవి శంకర్ లు మాట్లాడుతూ.... పల్లెలు, పట్టణాలు పరిశుభ్రతతో కళకళ లాడుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పల్లెప్రగతి



కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని అధికారులకు సూచించారు. రాబోయే వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను జెడ్పి ఛైర్పర్సన్, ఎమ్మెల్యే లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి కృష్ణారావు, ఎంపీపీ మేనేన్ని స్వర్ణలత రాజ నర్సింగారావు, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసిలు, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, ఎంపిడిఓ పద్మజారాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## నిత్యావసర వస్తువుల అందజేత

**ధర్మపురి జూన్ 15 (ప్రజామంటలు):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ వారు ప్రతినెల ఆర్థికంగా, బీదరికంతో ఇబ్బంది పడుతున్న రెండు కుటుంబాలకు బాసటగా నిలిచి వారికి ఒకనెలకు సరిపోయే నిత్యావసర వస్తువులని (పప్పులు, శర్కర, సబ్బులు' మంచి నూనె లాంటి 20 రకాల వస్తువులని) అందిస్తున్నారు. అందులో భాగంగా ఈ జూన్ నెలకు గాను 1. ధర్మపురిలోని గంపల వాడకు చెందిన జవ్వాజి బాపన్న అనారోగ్యంతో, దృష్టి లోపమనే అంగవైకల్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబానికి, 2. ధర్మపురి పట్టనంలోని సారగమ్మ వీధిలో ఉంటున్న దుదేకుల అలీమా 85 సం. వయస్సులో కుటుంబ సభ్యుల ఆధరణని కోల్పోయి ఒంటరిగా బీదరికం, ఆర్థిక ఇబ్బంధులతో జీవనం సాగిస్తున్న ఈ రెండు కుటుంబాలకు బాసటగా నిలిచి నెల రోజులకు సరిపోయే కిరాణా సామాగ్రిని అందించింది. శ్రీ లక్ష్మీ నర సింహ స్వచ్ఛంద సేవా సంస్థ. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పప్పుల శ్రీని వాస్, రంగ హరినాథ్, ఎడ్ల గంగరాజం, రంగు లక్ష్మీనరహరి లు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

**భీమదేవరపల్లి జూన్ 15 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ లో దారుణం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ గురై



యువకుడు మృతి చెందాడు. బుధ వారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం విద్యుత్ షాక్ తో తెల్లవారు జామున గ్రామానికి చెందిన పొన్నాల శ్రీనివాస్ (30) అనే వ్యక్తి విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

**ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా అధ్యక్షుడు సదుల వినయ్**

**కోరుట్ల టౌన్ 15 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు కు వినతి పత్రం సమర్పించినట్లు ఎన్. ఎస్.యు. ఐ జిల్లా అధ్యక్షుడు సదుల వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టి మైనార్టీ విద్యార్థుల యొక్క ఫీజు రియింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు కళాశాలల్లో



ఫీజు చెల్లించలేక నానా ఇబందులు పడుతున్నారని అంతే కాకుండా విద్యార్థులు త్రీవ మానసిక ఆవేదనకు గురువుతున్నారన్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేసి పేద విద్యార్థులలు ఆదుకోవాలని సదుల వినయ్ ప్రభుత్వాన్ని కోరారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణం పట్టణంలోని సమిండ్ల సత్తయ్య రూ. 60,000, అయాన్ సయ్యద్ రూ. 30,000, ఏ. లక్ష్మీ రూ. 1,00,000, ఎస్. జమునా రూ. 24,500 నలుగురు లబ్దిదారులకు ఇటీవల శస్త్ర చికిత్స జరగగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.



2,14,500/- విలువగల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ లబ్బిదారుల ఇంటి వద్ద అందచేశారు. సహాయం కోసం కృషి చేసినందుకు సంజయ్ కుమార్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గంగమ్మ బోనాల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్

జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు): పట్టణం లోని ఉప్పరిపెట్ లోని గంగమ్మ తల్లి ఆలయంలో గంగమ్మ బోనాల జాతర కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ప్రవీణ్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గంగపుత్రులు పూర్వ కాలం నుండి చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు అని, గత ప్రభుత్వల నిర్లక్ష్యం వల్ల కుల వృత్తులు కనుమరుగు అయ్యే పరిస్తితి వచ్చిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడిక తీసి, గంగ పుత్రులు ఉచిత చేప పిల్లలు,సేఫ్ జాకెట్లు, వాహనాలు పంపిణీ చేసి కుల వృత్తులకు ప్రాధాన్యం కల్పించడం జరిగింది అని, చెరువులు ఆక్రమణలు కాకుండా హద్దులు కూడా నిర్ణయించిందని ఇలా గంగ



పుత్రులు కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నిండు వేసవిలో కండ్ల పల్లి చెరువు నిండు కుండలా ఉందని, కేసిఆర్ అంటే కె అంటే కాలువలు, సి అంటే చెరువులు, ఆర్ రిజర్వాయర్ లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ గంగపుత్ర సంఘం అధ్యక్ష కార్యవర్గ సభ్యులు కుల సంఘ నాయకులు తెరాస కౌన్సిలర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు అన్యాయం జరగదు

**వారిని తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు : ఎలాంటి భయబ్రాంతులకు గురి కావద్దని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే**



**హుస్నాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** గౌరవెల్లి భూనిర్వాసితులకు ఎట్టిపరిస్థితుల్లో అన్యాయం జరగబోతోందని వారికి అండగా ఎల్లప్పుడూ నేను ఉంటానని హామీ ఇచ్చిన హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్. హుస్నాబాద్ పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌరవెల్లి ఎత్తిపోతల పథకం పై మాట్లాడుతూ.... గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నందున పూర్తి చేసేందుకు భూనిర్వాసితులు సహకరించాలని హుస్నాబాద్ శాసన సభ్యులు వొడితల సతీష్ కుమార్ తెలియజేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ రైతులకు ప్రతి ఎకరాకు పవిత్రమైన గోదావరి నీళ్లను తీసుకురావాలన్న కళ త్వరలో నెరవేరుతుంది. ప్రతిపక్షాల కుట్రపూరితమైన చర్యలతో హుస్నాబాద్ రైతులకు నీళ్లు అందించకుండా ప్రాజెక్టు పనులు చేయకుండా అడుగడుగున అడ్డుకున్న సంఘటన మంచిది కాదు అని స్పష్టం చేశారు. భూ నిర్వాసితులకు అన్యాయం జరగదు ఇచ్చిన హామీ మేరకు భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కానీ ప్రతిపక్ష పార్టీలు పబ్బం గడపడం కోసం రైతులను తప్పు దోవ పట్టించడం వల్ల భూ నిర్వాసితులు వాళ్లకు వాళు ళ అన్యాయం జరిగిందని ఊహించుకుంటున్నరు అని తెలియజేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 97.82 శాతం భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించడం జరిగింది. కేవలం 2.18 శాతం మాత్రమే ఉందని తెలియజేశారు. అయితే కాంగ్రెస్, బిజెపి మరియు ఇతర పార్టీల నాయకులు నీళ్లు వస్తే మాకు పుట్టగతులు ఉండవనే ఉద్దేశంతో రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఈ ప్రాజెక్టు పనులను అడ్డుకుంటున్నరు అని తెలియజేశారు.

గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మాణములో భాగంగా పాత ముంపు ప్రాంతం (1.42 టిఎంసి) క్రింద 1814.33 ట ఎకరాల భూమి భూసేకరణ కొరకు రూ. 38.11 కోట్ల రూపాయలు 2011 సంత్సరం లోనే చెల్లించినారు. మరియు కొత్తది ముంపు ప్రాంతం కొరకు 2055.17 ఎకరాల భూమి భూసేకరణ కోరకు అవసరం కాగా ఇందులో 1971.10 ఎకరాల భూమి కి రూ.159.96 కోట్ల రూపాయల పరిహారము చెల్లించి, 2017 నుంచి ఎకరాకు 6.95 లక్షల నష్టపరిహారం తో భూసేకరణ జరిగింది. మిగిలిన 84.07 ఎకరాల భూమికి ప్రభుత్వము నుండి నష్టపరిహారం డబ్బులు మంజూరు అయినప్పటికీ ఇట్టి భూమికి సంబంధించిన రైతులు పరిహారము తీసుకొనుటకు ముందుకు రావడం లేదు. రాష్ట్రం లో ఎక్కడా లేని విధంగా ఎకరాకు 15 లక్షల పరిహారం ను పెంచిన కూడ రైతులు ముందుకు రావటం లేదు. వీటికి సంబంధించి త్వరలో అవార్డు చేసి కేంద్రం ప్రభుత్వ చట్టం ప్రకారం ఎకరాకు 3.94 లక్షల చొప్పున కోర్టు లో డిపాజిట్ చేసి చట్ట ప్రకారం త్వరలో సేకరించబడుతుందని తెలిపారు.

**ఇళ్ళు:**

గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మాణములో భాగంగా పాత ముంపు ప్రాంతం క్రింద 693 ఇండ్లు ముంపుకు గురి అగుచున్నవి. ఇందులో 683 ఇండ్లుకు రూ. 83.00 కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించి సేకరించబడినవి. మిగిలిన 10 ఇండ్లలో 5 ఇండ్లు కుటుంబ తగాదాలు మరియు మిగతా 5 ఇండ్లకు రిసర్వే చేయమని సంబంధిత నిర్వాసితులు కోరినందున ఇవ్వలేక పోయినాము ప్రస్తుతము ఇట్టి ఇండ్ల సమస్యలు పరిష్కారమైనందున వీటికి అవార్డు చేసి పంపంచడమైనది వీటికి కూడ త్వరలో నష్టపరిహారం చెల్లించబడును.

**పునరావాస పునరోపాది (ఆర్ అండ్ ఆర్) నష్టపరిహారం.....**

గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మాణములో బాగంగా పాత ముంపు ప్రాంతం క్రింద పునరావాస పునరోపాది (ఆర్ అండ్ ఆర్) కు సామాజిక సర్వే చేసి అప్పటి జి.ఓ. 68 క్రమంగెజిట్ నెం.55 ను ప్రచురించి, గ్రామము లో (937) పిడిఎఫ్ లు గా మరియు 49 పిఏఎఫ్ గా గుర్తించడమైనది. అయితే డబ్బులు తక్కువ వస్తున్నాయని వారు కోరటంతో, రాష్ట్రం లో ఎక్కడ లేని విధంగా 18 సం. దాటిన ప్రతి ఒక్కరికీ 8 లక్షల చొప్పున పరిహారం ను జిఓ ఎంఎస్ నం. 23 ప్రకారము ప్రత్యేకంగా ప్రకటించనైనది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద డబ్బు ను 927/937 కుటుంబాలు తీసుకున్నాయి. మిగిలిన (10) పిడిఎఫ్ లు లో (5) పిడిఎఫ్ లు కోర్టుకు పోయినారు. మిగతా (5) పిడిఎఫ్ లు తీసుకోడానికి ఇటీవలే ముందుకు వచ్చినారు. అది కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాలతో పాటు మౌలిక సదుపాయాలను కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. భూ నిర్వాసితులు ఎలాంటి ఆందోళన చెందవద్దని నిర్భయంగా ఉండాలని తెలియజేశారు.ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో 18 సంవత్సరాలు వయసు కలిగిన వారందరి కోసం ప్రత్యేకంగా ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్తాను అన్నారు. 6 లక్షల రూపాయలు ప్యాకేజీ భూ నిర్వాసితుల చట్టంలో లేదు కాబట్టి కలెక్టర్ కి అప్పగించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి 6 లక్షల స్థానంలో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశానుసారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాలతో పాటు మౌలిక సదుపాయాలను కేటాయిస్తామని ఈ స్థలాలను అక్కన్న పేట మండలం హెడ్ క్వార్టర్ లో లేదా రామవరం గ్రామంలో ఇప్పిస్తామని తెలియజేశారు. భూ నిర్వాసితుల అనవసరంగా ప్రతిపక్షాలు చెప్పే గారడి మాటలు విని నష్టపోవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు ,సర్పంచులు, టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేలేరు తహాశీల్దార్ సమ్మయ్య కాళ్లు మొక్కిన ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్

**మిగితా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకోలు**

**సానుకూలంగా స్పందించిన తహాశీల్దార్ సమ్మయ్య**

**వేలేరు జూన్ 15 (ప్రజామంటలు):** వేలేరు గ్రామంలోని ఇళ్లులేని నిరుపేదలకు పోచమ్మ కాలనీ లోని సర్వే నంబర్ 1830, 1831 లో



గల ఇండ్ల స్థలాలను పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ తహశీల్దార్ సమ్మయ్యకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ పాదాభివందనం చేశారు. ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో ఇళ్లు లేని పేదలతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సమ్మయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత పది సంవత్సరాల క్రితం గ్రామ శివారులో ఉన్న పోచమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, అందులో కొందరు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు నిర్మించుకున్నారని అన్నారు. గతంలో ఇండ్లు నిర్మాణం చేసుకోలేని పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతకొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ ముగ్గురు వ్యక్తులకు పోచమ్మ కాలనీలో ప్లాట్లు కేటాయించి ఇంటి నిర్మాణానికి గ్రామ పంచాయతీ, తహశీల్దార్ కార్యాలయం అధికారులు అనుమతి ఇచ్చారని ఈ ముగ్గురు వ్యక్తులకు ఏవిధంగానైతే ఇంటి స్థలాలు కేటాయించారో మీగితా పేదలకు కూడా అదే నిబంధనలు అనుసరించి ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. నిన్న ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ముగ్గురు వ్యక్తులలో ఓ వ్యక్తి మాట్లాడుతూ.... ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ తమ ఇళ్ల నిర్మాణానికి అడ్డుపడుతున్నాడని, మమ్మల్ని బెదిరిస్తున్నాడని, ఆయనకు రెండు ఇళ్లు ఉన్నాయని మాకు ఉండకూడదా? అని ప్రశ్నించారని, నేను మీ ఇంటి నిర్మాణానికి ఎక్కడ అడ్డుకున్నానో ఆధారాలు చూపెట్టాలని సవాల్ విసిరారు. రెండు ఇండ్లు నా కష్టార్జితం తో సంపాదించుకున్నానని ఏలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని అన్నారు. వెంటనే భాదితులకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను కోరారు. లేని పక్షంలో భాధితుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సలీమ్ మాలిక్, సారా వెంకటేష్, మునిగడప రాజమ్మ, కొడూరి స్వామి, కొయ్యడ రజిత, సాలమ్మ, వనం రమేష్, సుశీల, మ్యాక లచ్చమ్మ, కారం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులు పరిహారం అడిగితే దాడి చేస్తారా?

**టిఆర్ఎస్ ప్రభుత్వ న్యాయం ఇదేనా?**

**ప్రాజెక్టు భూనిర్వాసితుల పోరాటానికి సిపిఎం మద్దతు**

**హుస్నాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసితులు తమకు న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న భూ నిర్వాసితులకు పరిహారం అందించకుండా భూములు ఇచ్చిన నిర్వాసితుల పై దాడి



చేయడం ఇదేనా టిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చే గౌరవం, ప్రజలకు చేసే న్యాయం అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్వాసితులు ఆందోళన చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సీతారాములు మాట్లాడుతూ.... గత రెండు రోజులుగా టిఆర్ఎస్ ప్రభుత్వం పోలీసులు నిర్వాసితులపై దాడులు చేస్తూ గాయపరచడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు అందించాల్సిందిగా పోయి, ముఖ్యమంత్రే స్వయంగా కుర్చీ వేసుకొని ప్రాజెక్టు భూ నిర్వాసితులకు అండగా ఉంటామని, ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికి చివరకు నిర్వాసితులను ఏమాత్రం ఆదుకోకుండ ఇచ్చిన హామీలు అమలుచేయాలని అడిగినందుకు లాఠీ ఛార్జ్ చేయడం, టిఆర్ఎస్ కార్యకర్తలతో దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దీనికి నైతిక బాధ్యత వహించి నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిర్వాసితులకు అండగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఎం. వాసుదేవ రెడ్డి, సిపిఎం సీనియర్ జిల్లా నాయకులు నక్కల యాదవ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గూగులోత్ భీమానాయక్, రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, చొప్పరి రవికుమార్, ఆలేటి యాదగిరి, గూగులోత్ శివరాజ్, బండ కింది అరుణ్ కుమార్, నాయకులు గూగులోతు రాజు, ఎండి షఫీ, సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 27 ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి న్యాయమైన ముగింపు నివ్వాలి

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** మాదిగల సంగ్రామం వర్గీకరణ బిల్లు పెట్టకుండా మోసగిస్తున్న బిజెపి మాదిగలకు న్యాయం చేయలేని వాళ్ళు తెలంగాణ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ? 30 ఏళ్లుగా నమ్మించి, తమ పార్టీ మేనిఫెస్టోలో పెట్టుకొని, లేఖలు ఇచ్చి, అనేక వేదికల మీద మద్దతిచ్చి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా అధికారంలోకి రాగానే మరొక విధంగా



ప్రవర్తించడం తమ నీతిమాలిన చర్యలకు పరాకాష్ట అని,ఎస్.సి వర్గీకరణ అనే సామాజిక న్యాయ ఎజెండా లేని బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎం.ఎస్.ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. నాగిరెడ్డిపల్లి గంగాపూరం, అలీంపురం, కట్కూరు, బండనాగరం, కొడవటూర్ గ్రామాల్లో యాత్ర కొనసాగగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన చైతన్య సభల్లో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పట్ల పాలకులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకొని రానున్న పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మోసం చేసే ధోరణిని వీడి 27 ఏళ్ల సుదీర్ఘమైన వర్గీకరణ పోరాటానికి న్యాయమైన ముగింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం అని పదే పదే మాట్లాడే పార్టీలు ఆ సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమైన వర్గీకరణ అంశంపై నిబద్ధతతో మాట్లాడక పోవడం దారుణమని మండిపడ్డారు. వర్గీకరణ ప్రస్తుతం అనివార్యమని ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతున్న ఈసందర్భంలో వర్గీకరణ లేకపోతే తీవ్రంగా నష్టపోయేది మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలేనని గుర్తు చేశారు. వర్గీకరణను సాధించు కునేందుకు మాదిగలు భాగాలతో కూడిన పోరాటాలకు సిద్ధం కావాలని ప్రభుత్వంపై యుద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాదయాత్ర బృందం ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఇనుముల అనిల్ మాదిగ, నేతలు పొట్టి రమేష్ మాదిగ మూటకోరు వెంకటేష్ మాదిగ, అల్వాల రాజేష్ మాదిగ, ఇనుముల ప్రభాస్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, కుమార్ స్వామి మాదిగ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో శ్రీశ్రీ 39 వర్ధంతి

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలో జనగామ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 39 వ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సాహిత్య సేద్యం గురించి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్



అధ్యక్షత వహించగా సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ, జనగామ రచయితల సంఘం అధ్యక్షులు అయిలా సోమనర్సింహాచారి, జి. వై. గిరి పౌండేషన్ చైర్మన్ జి. కృష్ణ, టీపా అధ్యక్షుడు టి. రామచంద్రం, పెట్లోజు సోమేశ్వరాచారి, చిలుమోజు సాయికిరణ్, బుదారపు లావణ్య, కొట్టె శ్రీలత, గొలుసుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎంసెట్ కోచింగ్ విద్యార్థినికి**

## ఆర్థిక సహకారం

**జనగామ జూన్ 15 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ జనగామ డైమండ్స్ సభ్యుడు లయన్ సామ శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా ఎడ్యుకేషన్




ప్రోగ్రామ్స్ అండ్ లోకల్ నీడి సర్వీసు సభ్యుడు లయన్ సామ శ్రీనివాస్ సహాయ సహకారాలతో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ముగించుకొని ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్న కె. భువనేశ్వరికి 3000 రూపాయల చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ గట్టు శ్రీనివాస్ అధ్యక్షుడు, లయన్ గందే వేణు కార్యదర్శి, లయన్ కృష్ణ జీవన్ బజాజ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లైజన్ ఆఫీసర్, కాసాల సంతోష్ వాసవి క్లబ్ కార్యదర్శి, గొడిశాల శివరామకృష్ణ, కందుకూరి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్‌లో అక్షరాభ్యాసం

**తరిగొప్పుల జూన్ 15 (ప్రజామంటలు):** మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాల చిన్నారులందరికీ అక్షరాభ్యాసం, మండల కేంద్రంలోని తరిగొప్పుల (జగ్గయ్యపేట) లో గ్రామ సర్పంచ్ దామెర ప్రభుదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా



గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.... తల్లిదండ్రులు అందరూ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. అలాగే అంగన్వాడీలో ఎల్కేజీ, యూకేజీ ఆంగ్ల భాషలో బోధించడం జరుగుతుందని, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగు తుందన్నారు. అదేవిధంగా ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి. భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ అంకం శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ సుంకరి శారద, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మాస్త్రం ట్రైలర్ విడుదల

## హాలీవుడ్‌ను తలపించేలా విజువల్స్

బాలీవుడ్ స్టార్‌కపుల్ రణబీర్ కపూర్ ఆలియా భట్ జంటగా.. భారీ పాన్ ఇండియా మూవీగా బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'బ్రహ్మాస్త్రను తెలుగులో దీనిని 'బ్రహ్మాస్త్రం' పేరుతో విడుదలచేయనున్నారు. ఇందులో బిగ్ బి అమితాబ్ బచ్చన్ , టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జున కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'బ్రహ్మాస్త్రం' ట్రైలర్‌ను బుధవారం అధికారికంగా రిలీజ్ చేసారు. మెగాస్టార్ చిరంజీవి వాయిస్ ఓవర్ తో మొదలైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. నీరు, గాలి, నిప్పు.. కొన్ని వేల సంవత్సరాలుగా ఈ శక్తులన్నీ కొన్ని అస్త్రాలలో ఇమిడి ఉన్నాయి. ఈ కథ ఈ అస్త్రాలన్నింటికి అధిపతి అయిన బ్రహ్మాస్త్రానిది. ఆ బ్రహ్మాస్త్రం యొక్క విధి తన అరచేతి రేఖలలో చిక్కుకొని ఉందన్న విషయం ఆ యువకునికే తెలియదు. అతనే శివా' అంటూ చిరంజీవి చెప్పే డైలాగ్ గంభీరంగా ఉంది. బ్రహ్మాస్త్రం కోసం పోరాటం, దుష్టశక్తుల యుద్ధం.. అద్భుతమైన లవ్‌స్టోరీ..ఇలా అన్నింటిని కలిపి ట్రైలర్‌లో చూపించారు. స్టార్ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్, ప్రైమ్ ఫోకస్ మరియు స్టార్‌లైట్ పిక్చర్స్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మమైన సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 9న హిందీ, తమిళం, తెలుగు, మలయాళం మరియు కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో దర్శకధీరుడు రాజమౌళి ఈ సినిమాని సమర్పిస్తున్నారు. 'బ్రహ్మాస్త్ర' చిత్రం మూడు భాగాలుగా విడుదల కాబోతోంది. త్రిమూర్తుల తత్వాన్ని సోషియో ఫాంటసీ జోనర్‌లో దర్శకుడు తెలియ జెప్ప బోతున్నాడు. వీటిలో మొదటి భాగం 'శివ' ఇప్పుడు విడుదలకు సిద్ధమైంది. బ్రహ్మ, విష్ణు భాగాలు దీని తర్వాత విడుదల కాబోతున్నాయి. ఇందులో శివగా రణబీర్ కపూర్ నటించనుండడం విశేషం. పురాణాల్లో అత్యంత శక్తివంతమైన ఆయుధంగా బ్రహ్మాస్త్రాన్ని పేర్కొంటారు. దాని గొప్పతనాన్ని ఈ సినిమాతో ఆవిష్కరించబోతున్నాడు దర్శకుడు అయాన్ ముఖర్జీ. గ్రాఫిక్స్ మాయాజాలంతో.. విజువల్ వండర్‌గా రూపొందుతోన్న 'బ్రహ్మాస్త్రం' చిత్రం ఏ స్థాయిలో సక్సెస్ అవుతుందో చూడాలి.

# చోళరాజుల కాలం నాటి కథతో సినిమా

## మణిరత్నం దర్శకత్వంలో పొన్నియిన్ సెల్వన్

ప్రముఖ దర్శకుడు మణిరత్నం ప్రస్తుతం 'పొన్నియిన్ సెల్వన్' అనే చారిత్రక కథను తెరపైకి తీసుకురాబోతున్నారు. చోళరాజుల కాలంతో ముడిపడిన కథ ఆధారంగా ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీ మల్టీస్టారర్‌గా తెరకెక్కిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న ఈ సినిమాకు మణిరత్నం కూడా భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. కాగా, 'పొన్నియిన్ సెల్వన్' మొదటి భాగాన్ని సెప్టెంబర్ 30వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇందులో విక్రమ్ , కార్తి జయం రవి ప్రభు, ప్రకాశ్ రాజ్, శరత్ కుమార్, పార్తీబన్, ఐశ్వర్య రాయ్, ఐశ్వర్య లక్ష్మి, శోభిత ధూళిపాళ, త్రిష ప్రధానమైన



పాత్రలలో నటిస్తున్నారు. అయితే, ఇదే సినిమాలో అజిత్ భార్య షాలినీ కూడా ఓ అతిథి పాత్రలో కనిపించనుందనే లేటెస్ట్ న్యూస్ ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. బాలనటిగా పలు చిత్రాల్లో నటించిన షాలినీ, మణిరత్నం రూపొందించిన 'సఖి' సినిమాతో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అజిత్‌తో వివాహమైన తరువాత ఆమె సినిమాలకు దూరంగా ఉన్నారు. మళ్ళీ ఇంతకాలానికి షాలినీ 'పొన్నియిన్ సెల్వన్' సినిమాలో అతిథి పాత్రలో కనిపించనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, ఇందులో నిజం లేదని అజిత్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయట. దీనిపై మణిరత్నం గానీ, అజిత్ – షాలినీ గానీ స్పందించి క్లారిటీ ఇస్తారేమో చూడాలి.



# కొరటాలకు ఎన్టీఆర్ కొత్త కండీషన్?

స్టార్ డైరెక్టర్ కొరటాల శివ ఇటీవల మెగాస్టార్ తో రూపొందించిన చిత్రం ఆచార్య. ఈ మూవీలోని కీలక పాత్రలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించారు. భారీ స్థాయిలో రూపొందిన ఈ మూవీ రిలీజ్ కు ముందు అభిమానుల్లో అంచనాల్ని పెంచింది. కానీ తీరా రిలీజ్ అయ్యాక దారుణ ఫ్లాప్ గా నిలిచి ఫ్యాన్స్ తో పాటు ప్రతీ ఒక్కరికీ షాకిచ్చింది. భారీ అంచనాలు పెట్టుకున్న మూవీ ఇలా డిజాస్టర్ గా మారడంతో అంతా అవాక్కయ్యారు. ఈ మూవీ తరువాత కొరటాల శివ స్టార్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఓ భారీ మూవీ చేయబోతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ 30వ సినిమాగా తెరపైకి రానున్న ఈ భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో యువ సుధా ఆర్ట్స్ బ్యానర్ పై కొరటాల శివ స్నేహితుడు సుధాకర్ మిక్కిలినేని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రకటించి దాదాపు ఏడాది కావస్తున్నా..ఇటీవల ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా డైలాగ్ మోషన్ పోస్టర్ ని విడుదల చేశారు.

ఐదు భాషల్లో పాన్ ఇండియా వైడ్ గా ఈ మూవీని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఐదు భాషల్లోనూ డైలాగ్ మోషన్ పోస్టర్ ని విడుదల చేశారు. ఎన్టీఆర్ పలికిన సంభాషణలు పవర్ ఫుల్ గా వుండటం మాసీవ్ అవతార్ లో ఎన్టీఆర్ కనిపిస్తుండటంతో సినిమా ఓ రేంజ్ లో వుండే అవకాశాలు కనిపిస్తున్నాయని ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ జూలై నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం బయటికి వచ్చింది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరపైకి రానున్న ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ లో బిజీగా వున్న దర్శకుడు కొరటాల శివకు హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఓ కండీషన్ పెట్టారట. అదేంటంటే సోషల్ మీడియా సినిమాలకు ప్రధాన ప్రచార సాధనంగా మారిన నేపథ్యంలో దర్శకుడు కొరటాల శివని మళ్లీ సోషల్ మీడియాలో యాక్టీవ్ గా వుండమని ఎన్టీఆర్ చెబుతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఆచార్య-కు కొన్ని నెలల ముందు దర్శకుడు కొరటాల శివ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల తన సోషల్ మీడియా అకౌంట్ లని డీయాక్టివేట్ చేశారు.



## పక్కా కమర్షియల్‌తో

# వస్తోన్న గోపీచంద్

వైవిధ్యమైన కథనలను ఎంచుకుంటూ ప్రేక్షకుల్లో హీరో గోపీచంద్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు 'తొలివలపు' చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయమై..తర్వాత విలన్‌గా పలు సినిమాల్లో నటించి, మళ్లీ హీరోగా రాణిస్తున్నాడు. ప్రస్తుతం ఈ మ్యాచోస్టార్ 'పక్కా కమర్షియల్'మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మారుతి దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 1న విడుదల కాబోతుంది.

రాశీఖన్నా హీరోయిన్. విడుదల తేది దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్‌లో స్పీడ్ పెంచింది చిత్ర యూనిట్. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా గోపీచంద్ తాజాగా ఓ ఇంటర్వ్యూ తన రెమ్యూనరేషన్ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. జయం చిత్రానికి గాను తాను తీసుకున్న రెమ్యునరేషన్ కేవలం రూ.11 వేలు మాత్రమేనని చెప్పాడు.



డైరెక్టర్ తేజకు 11 లక్కీ నంబరు అని.. అందుకే తనకు రూ.11 వేలు ఇచ్చారని అన్నాడు. ఆ డబ్బులు తీసుకుని.. దీని పక్కన ఇంకో సున్నా ఉండోచ్చు కదా అని అనుకున్నానని సరదాగా చెప్పాడు.

ఇక ఇప్పటివరకు నటించిన చిత్రాలలో దేనికి ఎక్కువగా రెమ్యునరేషన్ తీసుకున్నావని అడగ్గా.. 'పక్క కమర్షియల్' చిత్రానికే అత్యధిక పారితోషికం అందుకున్నానని బదులిచ్చాడు. ఎవరికైనా అప్పు ఇచ్చారా అని అడిగితే.. చాలా మందికి ఇచ్చానని, కొంతమంది తిరిగి ఇస్తే.. మరికొంత మంది ఇవ్వలేదని చెప్పాడు. వారి పరిస్థితి చూసి తాను కూడా డబ్బులు అడగలేదన్నారు. ఇలాంటి విషయాలలో తాను అంత కమర్షియల్ కాదని గోపీచంద్ తెలిపాడు.

# సమాజం గురించి ప్రశ్నించే పాత్రే గాడ్సే

ఒరిజినల్ గాడ్సేకీ ఈ కథకీ ఎలాంటి సంబంధం లేదు. బొమ్మ తుపాకీతో స్టేజ్‌పై షూట్ చేయడానికి కూడా ఇష్టపడని సత్య.. సీరియల్ కిల్లర్‌గా ఎందుకు మారాడనేది కథ. ప్రస్తుత సమాజంలో మన మధ్య జరుగుతున్న బర్నింగ్ ఇష్యూని చూపించాం. మా ఫ్యామిలీలో దాదాపు



ఇరవై ఐదు మంది పిల్లలు నా కళ్లముందే పుట్టి పెరిగారు. అందరూ డిగ్రీలు, పీజీలు చేశారు కానీ ఏ ఒక్కరూ అర్హతకు తగ్గ ఉద్యోగాలు చేయట్లేదు. ఎందుకిలా జరుగుతుందనేది సర్వే చేసి ఈ స్క్రిప్ట్ రెడీ చేశాను. పుట్టిన ఊరు, జిల్లా, రాష్ట్రంలో ఉద్యోగం రాకపోతే ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారు. వీటి గురించి ప్రశ్నించడానికే గాడ్సే వస్తున్నాడు. ఇది ఎంటర్‌టైనర్ కాదు, ఆలోచింపజేసే సినిమా. అసలీ కథని పవన్ కళ్యాణ్ కోసం రాసుకున్నా. కానీ ఆయన వరకు రీచ్ అవ్వలేకపోయాను. ఇప్పుడీ సినిమా అయినా ఆయనకు చూపించాలనుకుంటున్నా. ఒకే ఒక్కడు, భారతీయుడు, అపరిచి తుడు సినిమాల స్ఫూర్తితో దీన్ని తీశాను. నెక్ట్స్ సత్యదేవ్‌తోనే మరో మూవీ చేయాల్సి ఉంది. 'బ్లఫ్ మాస్టర్2' కూడా చాలామంది అడుగుతున్నారు. దాని గురించి ఆలోచిస్తున్నామని అన్నారు.



# బొడ్రాయి, గణపతి పూజ కార్యక్రమం

## - పాల్గొన్న దాసరి ప్రవీణ్ కుమార్ నేత

**చిగురుమామిడి జూన్ 15 (ప్రజామంటలు):** మండలంలోని రేకొండ గ్రామంలో నాలుగు రోజుల పాటు జరిగే బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవ తొలిరోజు గణపతి పూజ, అఖండ దీపారాధన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిట్టల రజిత శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు చాడ శోభ లతో కలిసి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి దాసరి ప్రవీణ్ కుమార్ నేత పాల్గొన్నారు. కన్నుల పండుగగా సాగుతున్న బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం మొదటి రోజు దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాసరి ప్రవీణ్ కుమార్ నేత మాట్లాడుతూ.... తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బొడ్రాయి పండుగ నిర్వచనం అన్నారు. బొడ్రాయి అనేది గ్రామ దేవతలకు ప్రతినిధి అన్నారు. ఊరి భౌగోళిక పరిమాణం, ఊరి నిర్మాణం పైన ప్రజలాంటిదరికీ అవగాహన కల్పించడం కోసమే ఈ పండుగ చేస్తారని అంటారన్నారు. ప్రతీ ఒక్కరు తమ తమ మత ఆచారాలకు అనుగుణంగా దైవ చింతనను కలిగి ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత చేకూరు. అందులో భాగంగానే ఆడపడుచులను సైతం పిలుస్తారని ఊరిలోని వారంతా కలిసి ఐక్యమత్యంగా ఉండాలని ఊరి బాగు కోసం ప్రతి ఒక్కరు ఆలోచించాలనేది దీని వెనక ఉన్న ఉద్దేశ్యమని దాసరి ప్రవీణ్ కుమార్ నేత వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్తూరి సంధ్య రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ చాడ మహిపాల్ రెడ్డి, వార్డు సభ్యులు పీరల్ల లక్ష్మి మోర ప్రవీణ్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలకు ఎంపిక

## – నోటీసు బోర్డుపై జాబితా

**గొల్లపల్లి జూన్ 15 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల గొల్లపల్లిలో ప్రవేశానికి జరిగిన పరీక్షలో ఎంపికైన వారి జాబితాను పాఠశాల నోటీసు బోర్డు పై అంటించడం జరిగిందని తెలిపారు. 6 నుండి 10 వ తరగతి వరకు జరిగిన ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు టిసి, స్టడీ సర్టిఫికేట్, కుల, ఆదాయ మరియు సంబంధిత ధ్రువ పత్రాలు, నాలుగు ఫోటోలు తీసుకుని వచ్చి ప్రవేశం పొందవలసిందిగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ తెలియజేశారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన వారు సంబంధిత సర్టిఫికెట్ లతో వచ్చి ప్రవేశం పొందవలసిందిగా సూచించారు. పాఠశాలలో ప్రవేశానికి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# గాంధీలో డీ.ఎమ్.ఈ. రమేశ్ రెడ్డి బర్త్ డే వేడుకలు

**సికింద్రాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీ.ఎమ్.ఈ) డా. కె. రమేశ్ రెడ్డి జన్మదిన వేడుకలు గాంధీ ఆసుపత్రిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ సూపరింటెండెంట్ ఛాంబర్ లో నిర్వహించిన కార్యక్రమంలో డీ.ఎమ్.ఈ. రమేశ్ రెడ్డి కేకును కట్ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు,



అడ్మినిస్ట్రేషన్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ లతో పాటు పలువురు వైద్యులు, ఉద్యోగ సంఘ నాయకులు, సిబ్బంది రమేశ్ రెడ్డికి బర్త్ డే విషేస్ చెప్పారు. రమేశ్ రెడ్డి మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ ఎమ్ ఓ %-1 డా.జయకృష్ణ, గైనకాలజీ ప్రొ. జానకి, యూరాలజీ హెచ్.వో.డీ. ప్రొ. రవిచందర్, ప్రొ. రవిజాగీర్ దార్, టీ.ఎన్. జీ.వో. గాంధీ యూనిట్ ప్రెసిడెంట్ జి.ప్రభాకర్, సెక్రటరీ కె.యాదిలాల్, ట్రెజరర్ కె.శ్రావన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న ఆనంద్, ఎం.ఏ. ఖలీమ్, సరళ, భావన, తదితరులు పాల్గొన్నారు.

# వెబ్ సైట్‌ను ఆవిష్కరించిన మంత్రి కొప్పుల

**హైదారాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):** వృద్ధుల భద్రత, హక్కుల పరిరక్షణ భాగంగా వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధుల ఆర్థిక సహకార సంస్థ రూపొందించిన వెబ్ సైట్ (www tsseniorciti-




zens.cgg.gov.in) పోస్టరును మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ. వృద్ధుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులకు మరింత అవగాహన కల్పించేందుకు త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు, సలహాలిచ్చారు.

ఈ సందర్భంగా జాతీయ వయో వృద్ధుల హెల్ప్ లైన్ 14567, దివ్యాంగుల హెల్ప్ లైన్ 1800-572-8980 టోల్ ఫ్రీ నంబర్ల పనితీరును గురించి ప్రభుత్వ కార్యదర్శి దివ్యా దేవరాజన్, సహకార ఆర్థిక సంస్థ కమిషనర్ శైలజలు మంత్రికి వివరించారు.

# అబ్బాపూర్ సర్పంచ్, ఉప సర్పంచ్ సస్పెండ్

## ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**గొల్లపల్లి జూన్ 15 (ప్రజామంటలు):** గొల్లపల్లి గ్రామపంచాయతీ నిధులు పక్కదారి మళ్లించారని ఆరోపణలపై మండలంలోని అబ్బాపూర్ సర్పంచి పురం పురం శెట్టి పద్మ ఉప సర్పంచ్ ఎం. నరసయ్య పంచాయతీ కార్యదర్శి మారుతి ఆరు నెలల పాటు తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ రవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శులు తమ అధికారులను ప్రభుత్వ నిధులు దుర్వినియోగం దుర్వినియోగం చేసినట్లు గమనించిన చేసినట్లు పేర్కొన్నారు. రూ. 1,60,115 నిధులు నిధులు సంబంధించి అవకతవకలకు పాల్పడినందున వారిని సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వం కేటాయించిన అధికారులను నిధులను దుర్వినియోగం చేస్తే స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com